నేటి దినపత్రిక
సూర్య
బుధవారం
10 జనవరి
2024
పేజీలు 8
అమరావతి
గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్

# అనుకున్నదే జరిగింది

## ఎట్టకేలకూ ఆ పార్టీని వీడిన ఎంపీ కేశినేని నాని



- అందరితోనూ విబేధాలే...
- పార్టీ కంటే తానే ఎక్కువన్న భావన
- తనది బాబు స్థాయి అనుకునే వైఖరి
- పార్టీ నిష్క్రమణకు అదే ప్రధాన కారణం
- పార్టీ విధానాలను గౌరవించని తీరు
- తరచూ పార్టీని ఇబ్బంది పెట్టే వ్యాఖ్యలు
- వ్యక్తుల కంటే వ్యవస్థ గొప్పదంటున్న సీనియర్లు
- మరో పార్టీలో నాని తీరు నడవదని స్పష్టీకరణ

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** అనుకున్నదే జరిగింది. చాలాకాలం నుంచి అసంతృప్తితో టీడీపీలో కొనసాగుతున్న టీడీపీ విజయవాడ ఎంపీ కేశినేని నాని.. ఎట్టకేలకూ ఆ పార్టీని వీడారు. బయట వివాదరహితుడు,

2 లో



## కష్టాలు తెలిసిన నాయకుడు

# జగనన్న

- పాదయాత్రలో జగనన్న దృష్టికి వచ్చిన సమస్యలతోనే మేనిఫెస్టో
- మేనిఫెస్టో అమలులో భాగమే సంక్షేమ పథకాల వెల్లువ
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని వెల్లడి
- పాదయాత్ర పూర్తయి 5 సంవత్సరాలు అయిన సందర్భంగా వేడుకలు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు వైఎస్ జగన్ మాత్రమేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర పూర్తయి మంగళవారంతో ఐదేళ్లు నిండిన మిగతా 2లో...

## దళిత క్రిస్టియన్లను

# ఎస్సీలుగా కొనసాగించాలి

- జస్టిస్ బాలక్రిష్ణన్ కమిషన్‌కు మంత్రి నాగార్జున వినతి
- రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధి పథకాలను ప్రశంసించిన కమిషన్

వివరాలు 2 లో




## రెస్టారెంట్‌లలో

# ఆకస్మిక తనిఖీలు



**విజయవాడ మేజర్ న్యూస్ :** రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కరీముల్లా

- మధురిమ, ఆర్ ఆర్ దర్బార్ రెస్టారెంట్‌లలో ఆహార భద్రతా ప్రమాణాలు ఉల్లంఘన
- విశ్లేషణ నిమితం హైదరాబాద్‌కు నమూనాలు

షెరీఫ్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి పటమట, విజయవాడ పరిసర ప్రాంతంలోని మధురిమ, ఆర్ ఆర్ దర్బార్ రెస్టారెంట్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, సదరు హోటల్ లో అనుసరిస్తున్న ఆహార భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. అధికారులు రిఫ్రిజిరేటర్‌లో వండిన ఆహారం నిల్వ ఉంచుట, ఆహార తయారీ ప్రదేశం పరిశుభ్రత లేకపోవుట, ఆహారం ఉంచిన పాత్రలపై మూతలు లేకపోవుట, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రామాణికం లేని సలాడ్ ఆయిల్, జీరా సూప్, స్వీట్ సూప్, బోల్డ్ నూడుల్స్ వంటివి ఉపయోగించుట, ఒకసారి ఉపయోగించిన పోలార్ కాంపోనెంట్ నిర్దేశిత విలువ 25% కంటే ఎక్కువ కలిగిన వంట నునెని తిరిగి ఉపయోగించుట వంటి ఉల్లంఘనలను గుర్తించారు. అధికారులు నిల్వ ఉంచిన ఆహారం, మిస్‌బ్రాండెడ్ వస్తువుల నుంచి నమూనాలు సేకరించి స్టేట్ ఫుడ్ ల్యాబ్, హైదరాబాద్‌కు విశ్లేషణ నిమితం పంపడం జరిగినది. పైన తెలిపిన ఉల్లంఘనలకు గాను హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారి చేసి, పిదప తగు చర్యలు తీసుకోనుటకు పరిపాలన అధికారి, జాయింట్ కలెక్టర్ వారికీ ఫిర్యాదు చేయటం జరిగింది. హోటల్ నిర్వాహకులు అందరు కూడా ఎఫ్ఎస్-ఎస్ఏఐ ప్రామాణికం మిగతా 2లో

# పురుగు మందులు సీజ్

- పురుగు మందుల షాపులలో విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారుల తనిఖీ
- రూ.3.62 లక్షల విలువగల మందుల అమ్మకాలు నిలిపివేత



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** మండల కేంద్రమైన అమరావతిలో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)

## పురుగు మందులు సీజ్

మంగళవారం దాడులు నిర్వహించి కొన్ని పురుగు మందులను సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి అమరావతిలోని శ్రీ కృష్ణ ఎంటర్ ప్రైసెస్ షాపు వారు అనుమతులు లేకుండా, రికార్డ్స్ లేకుండా పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తున్నారని విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది., ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విజిలెన్సు ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ జనరల్ వారి ఆదేశముల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్సు ఎన్ఫోర్స్ మెంట్ ఎస్.పి. కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో మంగళవారం రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్సు మెంట్ అధికారులు దాడులు చేశారు. పల్నాడు జిల్లా అమరావతి మండల కేంద్రము లో శ్రీ కృష్ణ ఎంటర్ ప్రైసెస్ షాపులో తనిఖీలు చేయగా కొన్ని పెస్టిసైడ్, ఫర్టిలైజర్ స్టాక్ కు ప్రిన్సిపల్ సర్టిఫికెట్, "O" ఫామ్ లేదు, మొత్తం రూ. 3,62,458/- విలువ గలిగిన 365 లీటర్ల పెస్టిసైడ్స్, ఫెర్ట్ లైసెర్ స్టాక్ అమ్మకాలను నిలుపుదల చేశారు. పై తనిఖీలలో విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ వ్యవసాయ అధికారి కె. రమణ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ఎం.రామ చంద్ర య్య స్థానిక వ్యవసాయ అధికారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### రెస్టారెంట్‌లలో ఆకస్మిక తనిఖీలు

కలిగిన పదార్థాలు వినియోగించి పరిశుభ్రమైన ప్రదేశం లో ఆహారం తయారు చేసి నాణ్యమైన ఆహారం వినియోగదారులకు అందచేయాలని రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కరీముల్లా షేరీఫ్ సూచించారు. లేని పక్షంలో నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా కొనసాగించాలి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** మతం మారినా ఏమాత్రం మారని దుర్భర పరిస్థితుల మధ్య బతుకుతున్న దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కొనసాగించాలని దళిత క్రిస్టియన్లను ఎస్సీ కులాల్లో చేర్చాలన్న అంశంపై జాతీయ స్థాయిలో ఏర్పాటైన జస్టిస్ బాలక్రిష్ణన్ కమిషన్ ను కలిసి విజ్ఞప్తి చేసామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాలను కమిషన్ ఈ సందర్భంగా ప్రశంసించిందని తెలిపారు. దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా ఇవ్వాలన్న విషయంగా ఏర్పాటైన జస్టిస్ కేజీ బాలక్రిష్ణన్ ఇద్దరు సభ్యులతో కూడిన కమిషన్ మంగళవారం రాష్ట్రానికి వచ్చి రాష్ట్ర సచివాలయంలో విచారణ చేపట్టింది. మంత్రి నాగార్జున కమిషన్‌ను కలిసి దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కొనసాగించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ, వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఎస్సీల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. నవరత్నాలు, ఇతర పథకాల ద్వారా గత ఐదేళ్ల కాలంలో 1 కోటీ 23 లక్షలా 11 వేల 910 మంది ఎస్సీ లబ్దిదారులకు రూ.57 వేలా 828 కోట్ల రుపాయలను అందించడం జరిగిందని తెలిపారు. ఇది కాకుండా గడ చిన ఐదేళ్ల కాలంలో ఎస్సీ సబ్ ప్లాన్ (ఎస్సీ కాంపొనెంట్) ద్వారా రూ.62 వేలా 270 కోట్ల రుపాయలను ఎస్సీల సంక్షేమం కోసం ఖర్చు చేసామని వెల్లడించారు. ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా ఎస్సీ కుటుంబాలకు సాయం అందించడలోనూ, ఎస్సీ విద్యార్ధులకు అత్యధికంగా పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్పులు మంజూరు చేయడంలోనూ, భారీ సంఖ్యలో ఎస్సీ మహిళా గ్రూపులకు ఆర్థిక సహాయం అందించడంలోనూ ఏపీ దేశంలోనే నెంబర్ వన్‌గా ఉందని గతంలో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం జరిగిందని ఆయన గుర్తు చేసారు. ప్రస్తుతం రాష్ట్రంలో 59 కులాలు షెడ్యూల్ కులాల జాబితాలో ఉన్నాయని చెప్పారు. ఎస్సీలుగా సమాజంలో వివక్షకు గురవుతున్న పరిస్థితుల్లో సామాజిక మార్పు కోసం ఎస్సీలు మతం మారారని అభిప్రాయ పడ్డారు. మతం మారినా కూడా ఎస్సీల జీవన స్థితిగతులు మారని నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో ఇప్పటి వరకూ సిక్కుమతం, బౌద్ధ మతంలోకి మారిన ఎస్సీలను మళ్లీ ఎస్సీ కులాల్లో కొనసాగించడం జరిగిందని నాగార్జున వెల్లడించారు. అదే విధంగా క్రిస్టియన్ మతంలోకి మారిన దళితులను కూడా ఎస్సీలుగా కొనసాగించాలని కోరామన్నారు. క్రిస్టియన్లుగా మారినా కూడా అదే దళిత వాడల్లో, అవే దీన పరిస్థితుల మధ్య బతుకుతున్న ఎస్సీల బతుకుల్లో, వారి జీవన విధానాల్లో, సాంప్రదాయాల్లో ఏ మాత్రం మార్పు రాలేదని తమ ప్రభుత్వం గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో క్రిస్టియన్లుగా మారిన దళితులకు ఎస్సీ హోదాను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కూడా ప్రభుత్వం గుర్తించిందని వివరించారు. ఈ నేపథ్యంలోనే ఎస్సీల అభివృద్ధికి కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి క్రిస్టియన్లుగా మారిన ఎస్సీలను ఎస్సీలుగానే పరిగణించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ 2023 మార్చి 24 న అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించడం ద్వారా ఎస్సీల పట్ల తనకు ఉన్న ప్రేమను, అభిమానాన్నీ చాటి చెప్పారని నాగార్జున పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన విధంగానే దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా ఇవ్వాలని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ కే.జి. బాలక్రిష్ణన్ ను అభ్యర్థించామన్నారు. ఈ నివేదికను సమగ్రంగా పరిశీలించిన జస్టిస్ బాలక్రిష్ణన్‌తో పాటుగా కమిషన్ సభ్యులు డా.రవీంద్రకుమార్ జైన్, ప్రొఫెసర్ సుష్మా యాదవ్ కూడా రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధికి చేపడుతున్న పథకాలు ప్రశంసనీయంగా ఉన్నాయని కొనియాడారని వెల్లడించారు. ఎస్సీల అభివృద్ధికి చేపడుతున్న పథకాలతో పాటుగా విజయవాడలో రూ. 404 కోట్ల రుపాయల వ్యయంతో నిర్మించిన అంబేద్కర్ స్మృతివనాన్ని ఈనెల 19న సీఎం జగన్మోహన్ రెడ్డి జాతికి అంకితం చేస్తారని వివరించారు. ప్రతిపక్షాలు కూడా రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను గుర్తించాలని నాగార్జున కోరారు..

# అనుకున్నదే జరిగింది

(మొదటిపేజీ తరువాయి)

నిజాయితీపరుడుగా పేరున్న నానికి.. పార్టీలో మాత్రం వివాదాస్పదుడన్న పేరుంది. వ్యవస్థకు తప్ప, వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వని రాజకీయ పార్టీల నుంచి వ్యక్తిగత ప్రాధాన్యం కోరుకోవడమే, ఇన్ని సమస్యలకూ కారణంగా స్పష్ట మవుతుంది. నిజానికి టీడీపీకి ఉన్న ముగ్గురు ఎంపీల్లో కేశినేని నాని ఒకరు. మిగిలిన ఇద్దరిదీ పార్టీ లైనయితే% నానిది మాత్రం సొంత దారి. మిగిలిన ఇద్దరూ అధినేత చంద్రబాబును అనుసరిస్తుంటే, నాని మాత్రం తనది చంద్ర బాబు స్థాయి అని భావిస్తుంటారు. నాని టీడీపీ నిష్క్రమణకు అదే ప్రధాన కారణమన్నది, తమ్ముళ్ల విశ్లేషణ. అలాగని నాని మంచి వ్యక్తి కాదు. గ్లామర్ ఉన్న లీడర్ కాదు. జనాలకు అందుబాటులో ఉండే నాయకుడంతే! పోనీ స్థానికంగా సొంత పార్టీ అగ్రనేతలతో సఖ్యతగా ఉంటారా అంటే అదీ లేదు. అందరితోనూ విబేధాలే. వారి గురించి బహిరంగంగానే పరోక్ష విమర్శలు కురిపిస్తుంటారు. తిరువూరు వెళ్లి.. అక్కడ వైసీపీ ఎమ్మెల్యేపై యుద్ధం చేస్తున్న టీడీపీ నేతల మనోభావాలు దెబ్బతినేలా.. అధికార పార్టీ ఎమ్మెల్యేను పొగడ్తలతో ముంచెత్తుతారు. ఫలితంగా ఆయన వెంట ఒక్క అగ్రనేతకూడా లేని పరిస్థితి.

ఎన్నికల్లో తాను చెప్పిన వారికే సీట్లు ఇవ్వాలన్న పట్టుదల నుంచి.. ప్రచారం వరకూ తన మాటే నెగ్గాలన్న పంతం ఆయన సొంతం. సహజంగా పార్టీ అధినేతలెవరూ నేరుగా మాట్లాడే సందర్భాలు బహు తక్కువ. వైసీపీ అధినేత-సీఎం జగన్ అయితే అసలు మంత్రులు-ఎంపీలతోనే మాట్లాడరు. కానీ చంద్రబాబు తీరు అందుకు భిన్నం. బాబు దాదాపు ముఖ్య నేతలందరితో బాబు మాట్లాడతారు. వెళ్లే ముందో.. వచ్చే ముందో మాట్లాడతారు. జిల్లా పార్టీకి సంబంధించిన అంశాలుంటే ఆయా జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే-ఎంపీలతో నేరుగా ఫోన్‌లో మాట్లాడతారు. ఇక సందర్భానుసారం టెలికాన్ఫరెన్సుల ముచ్చట్లు సరేసరి. ఒక్కోసారి పని ఒత్తిడి ఉంటే.. ఆయన రాజకీయ కార్యదర్శి, పార్టీ ఆఫీసు ఇన్చార్జి టిడి జనార్దన్‌లాంటి వారు, సీనియర్లకు ఫోన్ చేసి బాబు మాటగా సమాచారం చేరవేస్తుంటారు. అంటే ఆ స్థాయి నేతలు చెబితే చంద్రబాబు చెప్పినట్లే లెక్క. వీరంతా తమ సమయం మొత్తాన్ని పార్టీకే వెచ్చిస్తుంటారు. నిద్రపోయే ముందు వరకూ, పార్టీ ఉన్నతి-విస్తరణ కోసమే ఓపికతో పనిచేస్తుంటారు. ఒకరకంగా చెప్పాలంటే అధినేతకు వీరే కళ్లు, చెవులు. అలాంటి కీలక నేతలంటే నానికి చులకన... లెక్కచేయరు. వారు ఫోన్ చేసినా 'నేను ఎవరితో మాట్లాడను. బాబుతోనే మాట్లాడతా' అనే ధిక్కారపర్వమే, నానిని పార్టీకి దూరం చేసిందన్నది తమ్ముళ్ల విశ్లేషణ.

మహానాడు అనేది పార్టీకి పండుగ. దానికి స్థాయి బేధాలు లేకుండా నేతలంతా హాజరవుతారు. పార్టీ భవిష్యత్తు కార్యక్రమాలపై ఆ వేదికపై చర్చిస్తారు. అలాంటి సభలకూ నాని వెళ్లరు. క్యాడర్‌లో చైతన్యం నింపిన పార్టీ ఉత్తరాధికారి లోకేష్ పాదయాత్రకు.. అధ్యక్షుడు అచ్చెన్న, యనమల, సోమిరెడ్డి, అశోక్‌గజపతిరాజు, బుచ్చయ్యచౌదరి, రామ్మోహన్‌నాయుడు, పితాని, కోట్ల, కన్నా, దేవినేని ఉమ, షరీఫ్, యరపతినేని వంటి అగ్రనేతలంతా హాజరయ్యారు. లోకేష్ పాదయాత్ర చేస్తున్న జిల్లాలకు వెళ్లి మరీ, ఆయనకు సంఘీభావం ప్రకటించారు. కానీ నాని మాత్రం లోకేష్ బెజవాడ పాదయాత్రకు వచ్చినా కనిపించరు. ఇక పార్టీ ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవానికి సైతం దుమ్మా కొట్టారు. దీన్నిబట్టి కేశినేని మానసిక పరిస్థితి ఏమిటన్నది, సులభంగా ఊహించుకోవచ్చని బెజవాడ తమ్ముళ్లు విశ్లేషిస్తున్నారు. పార్టీని ఖాతరు చేయని నేతను.. పార్టీ ఎందుకు మోస్తుందన్నది వారి ప్రశ్న. పార్టీ కంటే తానే ఎక్కువ అని భావించే, ఈ తరహా నేతలనూ ఏ రాజకీయ పార్టీ భరించదన్నది పరిశీలకుల విశ్లేషణ. అసలు అందరికీ అందుబాటులో ఉండే చంద్రబాబునే లెక్కచేయని నాని లాంటి నేతలు - మంత్రులు-ఎంపీలు-ఎమ్మెల్యేలకే అపాయింట్‌మెంట్లు ఇవ్వని అధినేతల వద్ద, ఎలా మనుగడ సాగిస్తారో అర్ధం కావడం లేదని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

స్వతంత్ర భావాలు, తాను చెప్పిందే వినాలనుకునే నాని లాంటి నేతలను, రాజకీయ నాయకత్వాలు ఎక్కువ కాలం భరించవని స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో అందరికంటే బాబుకే సహనం ఎక్కువ అన్నది నిర్వివాదం. బాబు ఎవరినీ పార్టీ నుంచి పోగొట్టుకోవాలని చూడరు. ధిక్కారాన్ని కూడా కొంతవరకూ సహిస్తారు. ఆ తరహా నేతలకు చాలా సమయం ఇస్తుంటారు. బుజ్జగిస్తుంటారు.. సీనియర్లను పురమాయించి వారితో మాట్లాడిస్తుంటారు. ఇక సదరు నేతల వ్యవహారం శృతిమించితే వారిని చివరలో వదిలేస్తారు. అలాంటి నేతకు అసహనం తెప్పించిన నాని, అసలు ఇంతకాలం పార్టీలో కొనసాగడమే ఆశ్చర్యం అని సీనియర్లు విశ్లేషిస్తున్నారు. నాయకుడు ఏ స్థాయికి ఎదిగినా, పార్టీని గౌరవించకపోతే వారు ఎక్కువ కాలం ఆ పార్టీలో మనుగడ సాగించలేరని వ్యాఖ్యానిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విపరీతమైన ఇమేజ్-పొలిటికల్ గ్లామర్ ఉన్న వైఎస్ సైతం, రాష్ట్రంలో సీనియర్లను ఢీకొన్నప్పటికీ.. ఢిల్లీలో కాంగ్రెస్ నాయకత్వానికి విధేయుడిగానే ఉన్నారు. అదే ఆయనను సీఎం వరకూ తీసుకువెళ్లిన విషయాన్ని విస్మరించకూడదు. ఇక్కడ నాని అటు సొంత నియోజకవర్గ నేతలతోపాటు, నాయకత్వాన్నీ లెక్కచేయని వైచిత్రి. పోనీ నాని ఏమైనా తన సొంత ఇమేజీతో ఎమ్మెల్యేలను గెలిపించారా అంటే లేదంటున్నారు. గత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్ధి నానికి మొత్తం 5,75,498 ఓట్లు వస్తే.. ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్ధులకు 5,44,819 ఓట్లు వచ్చాయి. అంటే.. విజయవాడ లోక్‌సభ పరిధిలో.. తాను చెప్పిందే జరగాలనుకునే నానికి, వ్యక్తిగతంగా వచ్చిన ఓట్లు 30,679 ఓట్లు మాత్రమే.

నిజానికి చంద్రబాబుపై.. విజయవాడ ఎంపీ సీటుకు సంబంధించి బోలెడు ఒత్తిళ్లు. సిఫార్సులు! జనసేనాధిపతి పవన్.. తన మిత్రుడైన, నిర్మాత పీవీపీకి సీటు సిఫార్సు చేశారు. అయినా వాటిని కాదని చంద్రబాబు.. కేశినేని నానికే సీటు ఇచ్చిన వైనాన్ని బెజవాడ తమ్ముళ్లు గుర్తు చేస్తున్నారు. నిజంగా నానికి జనంలో అంత వ్యక్తిగత ఇమేజ్ ఉంటే, అంత తక్కువ ఓట్లే ఎలా వస్తాయి? అందుకు కనీసం నాలుగైదు రెట్లు ఎక్కువ రావాలి కదా? నాని బలం అధికంగా ఉంటే విజయవాడలో ఒక్క సీటు మినహా, మిగిలిన 6 స్థానాల్లో పార్టీ ఎందుకు ఓడిపోయింది? అంటే నాని తనకు ఉందనుకుంటున్న బలం అంతా.. పార్టీ ద్వారా వచ్చిందే తప్ప, సొంతది కాదన్నది తమ్ముళ్ల లాజిక్ !

## ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు జగనన్న



(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా సాయిబాబారోడ్డు చంద్రమౌళి నగర్‌లోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రజల్లో ఉండటమే రాజకీయం అని నమ్మిన వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి అని తెలిపారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారా చూసి మేనిఫెస్టో రూపొందించారని చెప్పారు. ఇప్పటివరకు 98 శాతానికిపైగా హామీలు అమలు చేసిన నాయకుడు జగనన్న అని తెలిపారు. ప్రజలు ఏం కావాలో అది చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని చెప్పారు. ప్రజలకు మంచి చేశారు కాబట్టే ధైర్యంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నారని, గడపగడపకూ మన ప్రభుత్వం లాంటి కార్యక్రమాలు చేయగలుగుతున్నారని వివరించారు. జగనన్న జీవితం తెరిచిన పుస్తకం అని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటేనే దేశంలోనే ఒక గొప్ప విలక్షణమైన పార్టీగా జగనన్న నిలబెట్టారని పేర్కొన్నారు. ఇదంతా పాదయాత్ర వల్లనే సాధ్యమైందని వివరించారు. గొప్ప మేనిఫెస్టో రూపకల్పనకు పాదయాత్ర కారణమైతే... గొప్ప గొప్ప పథకాల అమలుకు మేనిఫెస్టో కారణమైందని చెప్పారు.

చెప్పాడంటే చేస్తాడంతే..

జగనన్న ఏదైనా హామీ ఇస్తే.. తప్పకుండా అమలు చేస్తారని చెప్పడానికి తమ మేనిఫెస్టోనే పెద్ద ఉదాహరణ అని మంత్రి వెల్లడించారు. ఈ రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడిని ఎప్పటికీ నమ్మరని తెలిపారు. ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టిన నేతగా బాబు చరిత్రలో మిగిలిపోతారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకుని వచ్చి, జగనన్నను ఓడించాలని చూస్తున్నారని తెలిపారు. ప్రజల ఆశిస్సులు జగనన్నకు మాత్రమే ఉన్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ గతం కంటే భారీ గెలుపుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దూసుకుపోతుందని తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు, గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఆయా డివిజన్ల పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఆయా కమిటీల సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కోన - పల్లెతుమ్మలపాలెం రోడ్ పనులను ప్రారంభించిన పేర్ని కృష్ణమూర్తి





**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కోన – పల్లెతుమ్మలపాలెం రోడ్ పనులను మచిలీపట్నం నియోజకవర్గ ఇంచార్జి పేర్ని కృష్ణమూర్తి ప్రారంభించారు. మచిలీపట్టణం మండలం పాతేరు, పొలాటితిప్ప 9/5,9/7 కాలువ క్రింద సాగు పొలాలకి నీరు కావాలని రైతు లు అడగటం తో వెంటనే సంబంధిత అధికారుల తో మాట్లాడి కాలువ కు నీటి సరఫరా పెంచే ఏర్పాటు చేశారు. అనంతరం ఈ నెల 19న విజయవాడ లో బిఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ సందర్భంగా సంతకాల సేకరణ కార్యక్రమం లో పాల్గొన్నారు., చిన్నాపురంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో జెసిఎస్ కన్వినర్ శొంఠి ఫరీద్, మాజీ జడ్పీటీసీ లంకె వెంకటేశ్వరావు, సర్పంచ్ లు, కార్పొరేటర్లు, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

# పీఎం విశ్వకర్మ పథకం మంజూరుకు దరఖాస్తు చేసుకోండి

## జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వెంకట్రావు




**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** పీఎం విశ్వకర్మ పథకం కింద వివిధ సంప్రదాయ చేతి వృత్తుల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్ వెంకట్రావు సూచించారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సౌజన్యంతో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై సెమినార్– కం – అవగాహన కార్యక్రమం మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్. వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతివృత్తుల మీద ఆధారపడి జీవించే వారు వారి ఆర్థిక అభివృద్ధికి ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. ఈ పథకం పట్ల అవగాహన కల్పించి సంప్రదాయ చేతివృత్తుల వారు దరఖాస్తు చేసుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ పథకం అమలు చేస్తున్నారన్నారు. వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, సంప్రదాయ బొమ్మల తయారీ, బుట్టలు చాపల తయారీ, తాపి పనివారు, పడవలు తయారు చేసేవారు, సుత్తి, పనిముట్లు చేసేవారు, శిల్పాలు– విగ్రహాలు చెక్కేవారు, చెప్పులు కుట్టేవారు, పూల మాలలు తయారు చేసేవారు, తాళాలు బాగు చేసే వారు, బార్బర్, దర్జీ (టైలర్), చేపల వల తయారు చేసేవారు, వాషర్ మెన్ (ధోబి) వంటి 18 రకాలైన సంప్రదాయ వృత్తులను ఈ పథకం కింద గుర్తించినట్లు తెలిపారు. వీరిలో వృత్తి నైపుణ్యం అభివృద్ధి పరచి వారి ఆదాయం పెంపునకు ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. వీరికి తగిన శిక్షణ ఇవ్వడం తోపాటు బ్యాంకు రుణాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడడం జరుగుతుందన్నారు. కులంతో సంబంధం లేకుండా గుర్తించబడిన సంప్రదాయ చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తూ, 18 సంవత్సరాలు పైబడిన వారు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్స్ ద్వారా కానీ, గ్రామ వార్డు సచివాలయాల ద్వారా గాని ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్, డిప్యూటీ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మూర్తి, కామన్ సర్వీస్ సెంటర్ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజాబాబు, దళిత్ ఎంటర్ ప్రెన్యూర్ అసోసియేషన్ (ఎన్జీవో) కోఆర్డినేటర్ పి నాగ కుమార్, స్థానిక జువెలరీ పార్క్ కార్యదర్శి జితేంద్ర,జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారి రాజేంద్ర, వివిధ చేతివృత్తుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తెలుగు వారందరి గుండెల్లో గూడు కట్టుకున్న మహోన్నత నేత రంగా

## రంగా అందరి మనిషి... రంగాఆశయాలు సాధిస్తున్నాం

## మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారందరి గుండెల్లో గూడు కట్టుకున్న మహోన్నత నేత వంగవీటి మోహన్రంగా అని, పేదల పక్షాన నిలబడ్డ ఆయన విధానాలే ఆయన్ని అందరి మనిషిగా తీర్చిదిద్దాయని, అటువంటి మహోన్నతుడి విగ్రహం మైలవరం నడిబొడ్డున ఏర్పాటు చేసే అవకాశం కల్పించడం తనకు ఆ భగవంతుడు కల్పించిన అదృష్టమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు.ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణంలో పేదల ఆరాధ్యుడు, దివంగత నేత, మహా మనిషి వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. కాపు కార్పోరేషన్ చైర్మన్ అడపా శేషు, రంగా అనుచరులు ఆకుల శ్రీనివాస్ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు.ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూవంగవీటి మోహన్ రంగా తో తన తండ్రి, మాజీ హోంమంత్రి వర్యులు వసంత నాగేశ్వరరావు కి ఉన్న అనుభవాలను గుర్తు చేసుకున్నారు. పేదల సంక్షేమం కోసం పాటుబడిన మహోన్నత వ్యక్తి రంగా అని అన్నారు. ప్రతి ఒక్కరూ పేదల సంక్షేమ కోసం రంగా అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. మహానేత రంగ ఆశయాలను సాధిస్తున్నట్లు పేర్కొన్నారు.నా కులం, నా మతం నా గుమ్మం వరకే అని స్పష్టం చేశారు. అన్ని కులాల్లో అన్ని మతాల్లో తనకు అభిమానులు ఉన్నారన్నారు. నన్ను ఇంతగా ఆదరించి, అభిమానించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల కోసం రంగా విగ్రహం ఇక్కడ పెట్టలేదన్నారు. వారి సామాజిక వర్గాన్ని కూడా తన గుండెల్లో పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు.మైలవరం నియోజవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సమచిత న్యాయం కల్పించినట్లు స్పష్టం చేశారు. రెడ్డిగూడెం మండలంలో ఎంపీపీ పదవిని, ఇబ్రహీంపట్నంలో ఎంపీపీ పదవిని కాపు సామాజిక వర్గానికి కేటాయించినట్లు పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన బీసీ గౌడ కులానికి చెందిన పామర్తి శ్రీనివాసరావుకు ఆయన అడగక పోయినా మైలవరం ఏ.ఎం.సి చైర్మన్ పదవిని ఆయనకు కేటాయించినట్లు వెల్లడించారు. అలానే అన్ని కులాలకు అవకాశం కల్పించాలనే ప్రధాన ఉద్దేశంతో ఏ.ఎం.సి చైర్మన్ పదవిని అప్పిడి సత్యనారాయణ రెడ్డి కి కేటాయించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఏ.ఎం.సి చైర్మన్ పదవిని ఎస్సీ వర్గానికి కేటాయిస్తానని స్పష్టం చేశారు.జి.కొండూరు మండల పరిషత్ అధ్యక్షురాలిగా పార్టీ కోసం కష్టపడిన వేములకొండ సాంబశివరావు కోడలు గౌడ సామాజిక వర్గానికి చెందిన వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మకు కేటాయించామన్నారు. అలాగే పార్టీ కోసం కష్టపడిన సర్నాల తిరుపతిరావుకు మైలవరం జెడ్పిటిసి పదవిని అప్పగించామన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్ పదవిని రెండున్నర ఏళ్ళు వడ్డెర సామాజిక వర్గానికి చెందిన గుంజా శ్రీనివాస్ కు, మరో రెండున్నర ఏళ్ళు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన రసూల్ భాయ్ కు కేటాయించినట్లు స్పష్టం చేశారు. అక్కడ పార్టీలోనే అంతర్గత వెనుపోట్లు కారణంగా స్పష్టమైన మెజారిటీ రాలేదన్నారు. తనకు మాత్రం అందరికీ సముచిత న్యాయ కల్పించటమే ప్రధాన లక్ష్యమన్నారు.గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న విధానాల మేరకు సామాజిక న్యాయం పాటిస్తూ తన హయాంలో అన్ని కులాలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. రాధారంగ మిత్ర మండలి ఆధ్వర్యంలో మహోన్నత నేత వంగవీటి రంగా విగ్రహం ఆవిష్కరణకు తనకు అవకాశం కల్పించిన మిత్ర మండలి సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన ఏడాది క్యాలెండర్లను ఆవిష్కరించారు. ముందుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాలు స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## స్పందనకు డాక్టరేట్



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** రసాయిన శాస్త్ర విభాగంలో పరిశోధనకు గాను జంజం స్పందన కృష్ణా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. టీ మాలతిరేఖ పర్యవేక్షణలో 'సింథసిస్ అండ్ బైలాజికల్ ఇవల్యూషన్ ఆఫ్ 8 – అమినక్యునోలిన్ పిరమిడిన్ అండ్ ఇందొలిజన్ – 6 ఒల్ డెరివేటివ్స్ 'అనే అంశం పై చేసిన పరిశోధనకు ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి చేతులమీదుగా పట్టా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా పి వీర బ్రహ్మచారి పాల్గొన్నారు.

## విద్యావికాస్ పాటశాలలో ఘనంగా సంక్రాంతి



**గుడివాడ, మేజర్ న్యూస్ :** విద్యావికాస్ పాటశాలలో సాంప్రదాయ బద్ధంగా సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా జరిగాయి. భోగిమంటలు, రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఊరేగింపులు, హరిదాసు చప్పుళ్ళు కనువిందు చేశాయి. సాంప్రదాయ బద్ధంగా రంగురంగుల దుస్తులు ధరించి విద్యార్థులు చేసిన సందడి అందరినీ ఆకట్టుకుంది. చిన్నారుల ఆట పాటలతో వేడుక సందడిగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్రాంతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రతీఏటా కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నిర్విఘ్నంగా సాగుతున్న చండీహోమం



**గన్నవరం, జనవరి 9, మేజర్ న్యూస్ :** లోక కల్యాణార్థం గన్నవరంలో టీడీపీ ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావ్ చేపట్టిన మహాచండి యాగం నిర్విఘ్నంగా కొనసాగుతుంది. రాష్ట్రం అభివృద్ధి చెందాలని, రాష్ట్రప్రజలు సుఖశాంతులతో ఉండాలని, మరో నాలుగు నెలల్లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో విజయం సాధించి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్న సంకల్పంతో యార్లగడ్డ గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చండీయాగం చేపట్టారు. ఈనెల 7వతేదీన ప్రారంభించిన ఈ యాగం నాలుగు రోజుల పాటు కొనసాగి బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి సమర్పణతో ముగుస్తుంది. యాజ్ఞికస్వామి దేవళ్ల మణికంఠశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ క్రతువులో 30 మంది ఋత్విక్కులు పాల్గొని వేదమంత్రాలతో యాగ పూజలు జరిపిస్తున్నారు. యాగం మూడవరోజైన మంగళవారం ఉదయం యార్లగడ్డ వెంకట్రావ్, జ్ఞానేశ్వరి దంపతులు యాజ్ఞకులుగా చండీయాగ, సుదర్శనయాగ పారాయణ చేశారు. అనంతరం మహాలింగార్చన, మానపాశుపత, దత్తాత్రేయ మూలమంత్ర పఠనం చేశారు. సాయంత్రం శతచండీ, లక్ష్మీకమలాలయ యాగం నిర్వహించి, చతుర్వాద స్వప్న దర్శనంతో మంగళవారం పూజలు ముగిసాయి.

## జగన్ పరిపాలనకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది



**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్:** పట్టణంలోని 13వ వార్డులో విగ్నేశ్వర ప్లాజా అపార్ట్మెంట్, శ్రీనివాస నిలయం అపార్ట్మెంట్స్‌లో పట్టణ తెదేపా కౌన్సిలర్లు, స్థానిక తెదేపా నేతలతో కలసి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు అవినీతిని ఎండగట్టాలి.చంద్రబాబునాయుడు పై రాష్ట్ర ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారు.కులాలు మతాలు ప్రాంతాల మధ్య చిచ్చులు పెడుతూ జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు పెట్టిస్తూ బడుగు బలహీన వర్గాలను జగన్మోహన్ రెడ్డి అణగదొక్కాడు.కనీసం గుంతలు పూడ్చలేనివాడు ప్రభుత్వాన్ని నడుపుతున్నాడు.నాలుగున్నర సంవత్సరాలలో జగన్మోహన్ రెడ్డి ఉద్ధరించిందేమీ లేదు.యువత నిరుద్యోగులై రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోతున్నారు.మళ్లీ రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే తప్ప మార్గం లేదని ప్రజలు గ్రహిస్తున్నారు.మరో మూడునెలల్లో ప్రజల ఆశలు ఫలించబోతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జగన్ ప్రజా సంకల్ప యాత్ర విజయోత్సవ వేడుకలు

**గుడివాడ, మేజర్ న్యూస్ :** జగన్ నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర 5వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భగా ఆపార్టీ శ్రేణులు గుడివాడ పార్టీ కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు విజయోత్సవ కేక్ కట్ చేస్తూ, జిందాబాద్ సీఎం జగన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం పార్టీ నాయకులు మీడియాతో మాట్లాడుతూ ప్రజాసంకల్ప పాదయాత్రలో, రాష్ట్ర ప్రజల సమస్యలను గుర్తించిన సీఎం జగన్ వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని నాడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీను అమలు చేస్తూ, మడమ తిప్పని నేతగా సీఎం జగన్ నిరూపించుకున్నారని కొనియాడారు. ప్రజల మద్దతుతో సీఎంగా జగన్, ఎమ్మెల్యేగా కొడాలి నాని తిరిగి విజయం సాధించడం తధ్యమని పార్టీ నాయకులు గంటాపదంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసీపీ అధ్యక్షుడు గొర్ల శీను, పార్టీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, జిల్లా అధికార ప్రతినిధి ఎంవి నారాయణరెడ్డి, సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్, ఎస్సీ సెల్ నాయకులు వెంపటి సైమన్, మహిళా సెల్ అధ్యక్షురాలు మాదాసు వెంకటలక్ష్మి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, చుండూరి శేఖర్, పల్లపోతు శ్రీనివాస్, విరిసెట్టి నరసింహారావు, గిరిబాబాయ్, జోగా నాగేశ్వరరావు, మూడేడ్ల ఉమా, నైనవరపు శేషుబాబు, అలీ బేగ్ పాల్గొన్నారు.

## కాగిత ఆధ్వర్యంలో భారీగా టీడీపీలో చేరికలు



**పెడన, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో చాలా బాగుందని మండల పరిధిలో అనేక గ్రామాల నుండి వైసీపీ కార్యకర్తలు టిడిపిలో చేరుతున్నారని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు ఈ మేరకు మండల పరిధి కవి పురం గ్రామంలో సుమారు 50 మందికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జనసేన తెలుగుదేశం పార్టీ కలిపి ప్రభుత్వాన్ని ఏర్పరుస్తాయని ప్రభుత్వాన్ని ఏర్పరిచిన నెల రోజుల్లో ఈ గ్యారెంటీ బాండ్ లో ఉన్నటువంటి పథకాలను తప్పక అమలపరుస్తామన్నారు. ఈ రాష్ట్రం అభివృద్ధి జరగాలన్న ఈ వైసీపీ ప్రభుత్వ అరాచకాలు పోవాలన్న రేపు రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో జనసేన తెలుగుదేశం పార్టీ కూటమీ అభ్యర్థి అయినటువంటి నన్ను మీరు గెలిపించాలి అని తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుపై ఓటు వేసి పెడన నియోజవర్గం నుండి నన్ను శాసనసభ్యులుగా ఎన్నుకోవాలని కాగిత కృష్ణ ప్రసాద్ కోరారు. అలాగే రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని ఈ సందర్భంగా కాగిత అన్నారు. మీ భవిష్యత్తే కాకుండా చదువుకున్న యువత భవిష్యత్తు ఈ రాష్ట్ర భవిష్యత్తు రూపురేఖలు మారాలి అంటే ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు మండల పార్టీ అధ్యక్షులు శలపాటి వీర ప్రసాదు, ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాదు, మండల జడ్పిటిసి అర్జ వెంకట నగేష్,స్వరూప రాణి, శ్రీరామ్ మూర్తి, వీరాంజనేయులు, కోటి నాంచారయ్య,వీర వెంకట్రావు, రమేష్,రాముడు, తదితరు టిడిపి నాయకులు జనసేన పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి కాకాణీ



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** రూరల్ మండల పరిధి గొల్లపూడిలోని మైలవరం శాసనసభ్యుని కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మంత్రి కాకాణి ని పుష్పగుచ్చాలు అందజేసి, ఘనంగా స్వాగతించచారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిరంజీవి యువతకు ఆదర్శం





### వాల్తేరు వీరయ్య విజయోత్సవ సభలో మాజీ ఉపసభాపతి బుద్ధ ప్రసాద్.

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మాజీ కేంద్రమంత్రి సినీ నటుడు చిరంజీవి నేటి యువతరానికి ఆదర్శమని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. చిరంజీవి అభిమాన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య 365వ రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ థియేటర్ పక్కన ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక మీద ఈ కార్యక్రమం నిర్వహించగా కార్యక్రమంలో బుద్ధ ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. కృషి క్రమశిక్షణ చిరంజీవి ఎదుగుదలకు కారణమని తెలిపారు కొలమానం లేకుండా అభిమానం కొల్లగొట్టిన గొప్ప నటుడు చిరంజీవి అన్నారు చిరంజీవి జీవితం ఒక వ్యక్తిత్వ వికాస గ్రంథం అన్నారు ఒడిదుడుకులను క్రమశిక్షణతో అధిగమించిన గొప్ప వ్యక్తి చిరంజీవిని కొనియాడారు. కేంద్ర మంత్రిగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ప్రశంసించడంతో పాటు తెలుగు భాషా అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు చిత్ర పరిశ్రమకు తెలుగుజాతికి చిరంజీవి పెద్దదిక్కు లాంటివాడు అన్నారు. అభిమాన సంఘాలను సేవా సంఘాలుగా మార్చి న ఏకైక నటుడు చిరంజీవి అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు అభిమానులను మార్చిన గొప్ప నటుడు అన్నారు. చిత్రం అవనిగడ్డలో ఏడాదిపాటు ప్రదర్శించడం గర్వకారణమని తెలిపారు చిరంజీవి కుటుంబానికి అల్లు రామలింగయ్య కుటుంబానికి తన తండ్రి మండలి వెంకటకృష్ణారావు దగ్గర నుండి సత్సంబంధాలు ఉన్నాయని ఇప్పుడు కూడా ఆ కుటుంబ సభ్యులతో అదే సంబంధాలు తాను కూడా కొనసాగిస్తున్నట్లు బుద్ధ ప్రసాద్ చెప్పారు. ప్రజాస్వామిక వాది చిరంజీవి అని ప్రజాస్వామ్యం పట్ల అపారమైన గౌరవం ఉన్న వ్యక్తిగా కొనియాడారు. తన నటన ద్వారా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలవ గలిగిన ఏకైక నటుడు చిరంజీవి అని బుద్ధ ప్రసాద్ కొనియాడారు. అటువంటి నటుడు సంబంధించిన విజయోత్సవ కార్యక్రమంలో తాను కూడా పాల్గొనడం సంతోషంగా ఉందని బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్కు సంబంధించిన దర్శకుడు బాబి నిర్మాతలు యలమంచిలి రవి ఎర్నేని నవీన్లతో పాటు అఖిలభారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రమణం స్వామి నాయుడు అవనిగడ్డ చిరంజీవి అభిమాన సంఘాల నాయకులు అప్పికట్ల తారక మస్తాన్ పద్యాల వెంకటప్రసాద్ తో పాటు జనసేన నాయకులు మాదివాడ వెంకట కృష్ణ (క్రిస్టియన్), గుడివాక శేషుబాబులతో పాటు పలువురు చిరంజీవి పవన్ కళ్యాణ్ అభిమాన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ మహా శిల్ప పోస్టర్ ఎమ్మెల్యే ఆవిష్కరణ



**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్:** పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాదయాత్ర ముగింపు చేసే ఐదేళ్ల సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూఆనాడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి చిందించిన చెమట చుక్కే.. నేటి సంక్షేమానికి, అభివృద్ధికి చుక్కాని అయ్యిందని అన్నారు. ఆనాటి ప్రజల కష్టాలను తెలుసుకొని.. మదిలో మెదలాడే నాటి జ్ఞాపకాల నుంచి పురుడు పోసిన నవరత్నాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. అనంతరం అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం పోస్టర్ ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. విజయవాడలో ఏ మూల నుంచి చూసినా రాజ్యాంగనిర్మాత అంబేద్కర్ కనిపిస్తారని.. సామాజిక న్యాయానికి వైఎస్సార్‌సీపీ, సీఎం వైయస్ జగన్ పెద్దపీట వేసినట్లు తెలిపారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ చరిత్రలో నిలిచిపోయే బహుమానమని తెలిపారు. భారతజాతి గురించి, మనదేశం గురించి చెప్పాలనుకున్నా మొదట చెప్పాల్సిన పేర్లలో అంబేద్కర్ పేరు ఉంటుందన్నారు. అంబేద్కర్‌ని ఓ సిద్ధాంతంగా తీసుకుని మనసావాచా నమ్మిన ఏకైక నాయకుడు ఎవరైనా ఉన్నారంటే.. అది సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో లేని సచివాలయం సిబ్బంది

### పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



**వత్సవాయి, జనవరి 9, మేజర్ న్యూస్ :** మండలంలో వేమవరం గ్రామ సచివాలయంలో ఈ పరిస్థితి నెలకొంది. ప్రజలు ఏదైనా పని ఉండి సచివాలయానికి వెళ్తే గంటలు తరబడి అధికారులకోసం ఎదురు చూడవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అవసరం ఉండి సచివాలయ సిబ్బందికి ఫోన్ చేసినా గాని ఫోన్ అందుబాటులోకి రారు. మంగళవారం ఉదయం 10:30 అవుతున్న సచివాలయం తలుపులు తీసి ఒక్క ఉద్యోగి కూడా విధుల్లో లేకపోవటం విశేషం. ఈ సచివాలయంలో ఎప్పుడు ఇదే పరిస్థితి ఏదన్న పని ఉండి ఫోన్ చేస్తే మీకేమైనా పని ఉంటే సచివాలయానికి రండి అంటున్నారు అక్కడికి వెళ్తే ఒక్కరు కూడా అందుబాటులో ఉండరని గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. పై అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని సచివాలయ సిబ్బందిని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలు సొమ్ము జీతాలుగా తీసుకొని ప్రజల అవసరాలకు అందుబాటులో లేకపోతే వారి గురించి పట్టించుకునే నాథుడే లేకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నించుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చూడాలని వారు కోరారు.

# ఎంఏ ఖాజా కుటుంబ సభ్యులను బీజేపీ నేతల పరామర్శ



**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్ :** పట్టణం లోని నేటి దినపత్రిక సూర్య స్టాఫ్ రిపోర్టర్, మాజీ మున్సిపల్ కో అప్టేట్ కౌన్సిలర్ ఎంఏ ఖాజా తల్లి జమీలున్ ఇటీవల మృతి చెందడంతో నేడు నందిగామ పట్టణంలోని వారి స్వగృహానికి వెళ్లిన భారతీయ జనతా పార్టీ సభ్యులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ఖాజా సోదరుని కుమారుడు అసిస్టెంట్ మేనేజర్ అబ్దుల్ హలీంని పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న నాయకులు, భారతీయ జనతా పార్టీ కన్వీనర్. తొర్లికొండ సీతారామయ్య. కో కన్వీనర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు, జిల్లా స్పోక్స్ పర్సన్ బండారు కేదార్నాథ్ శర్మ,మండల అధ్యక్షులు గంటా వెంకట్రావు,గుత్త బాలకృష్ణ,జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొత్త సాంబశివరావు తదితరులు పాల్గొని పరామర్శించారు.

# ఇసుక, మట్టి అక్రమాలపై స్పందించరెం : తెనాలి శ్రావణ్



తుళ్లూరు మేజర్ న్యూస్ : రాజధాని అమరావతిలో అక్రమంగా మట్టి ఇసుక తరలిస్తున్న వారి పై పోలీసులు కపట ప్రేమను చూపిస్తున్నారని వారిపై మాత్రం కేసులు నమోదు చేయకుండా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారిని వేధిస్తున్నారని గుంటూరు పార్లమెంటరీ టిడిపి ఇన్చార్జి నాయకులు తెనాలి శ్రావణ్ కుమార్ ఆగ్రహం వెలిబుచ్చారు మంగళవారం తుళ్లూరు పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి పోలీసుల ఏకపక్ష ధోరణిపై నిలదీశారు సామాన్యుడిపై పోలీస్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారని అక్రమార్కులకు కొమ్ముకోస్తున్నారని ఆరోపించారు నిరంతరం రాజధానిలో ఇసుక మట్టి తరలిస్తున్న కేసులు నమోదు చేయడం లేదని అన్నారు పోలీస్ వ్యవస్థ సరిగా స్పందించక పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉందని ఏకపక్షంగా అధికార పార్టీకి చెందిన వారికి ఒక న్యాయం సామాన్యుడికి ఒక న్యాయం చేసే విధంగా రాజధాని పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు గతంలో ఎన్నో మార్లుఇసుక, మట్టి, అక్రమాలపై కూడా ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని పోలీసులని ప్రశ్నించారు వడ్డమాను ఫ్లెక్సీ వివాదంలో పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించడంపై ఆవేశం వెలిబుచ్చారు ఎటువంటి పరిస్థితుల్లో కూడా బడుగు బలహీన వర్గాలకు దళితులకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు ఈ విషయమై శ్రావణ్ కుమార్ తుళ్లూరు సిఐ ఆనందబాబుతో చర్చలు నిర్వహించారు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామరస్యంగా వివాదాలు లేకుండా చూస్తామని సీఐ తెలిపినట్లు వివరించారు వడ్డమానులో మూడు రోజుల క్రితం ఒక ఫ్లెక్సీ గొడవ జరిగింది దానిపై...పోలీసులు ఏటువంటి చర్యలు తీసుకోలేదు అని సీఐ ని అడిగామనివిచారణ చేపట్టి...చర్యలు తీసుకుంటాం అని సీఐ తెలిపారు అన్నారు ఇదే విషయమై సీఐ ఆనందబాబుని వివరణ కోరగా చట్టానికి లోబడి మాత్రమే ఉంటామని ఎటువంటి తారతమ్య భేదాలు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దనేక వెంకట సుబ్బారావు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు ప్రధాన కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు చిలుకూరు వెంకటరెడ్డి కొమ్మినేని నాని చిలకా బసవయ్య కోకిల కట్ట నరసింహారావు తరిగోపుల సాంబశివరావు ఆరుద్ర సదాశివరావు అతి పట్ల బాలయ్య కాటా అప్పారావు గడ్డం వెంకటేశ్వరరావు గుమ్మా లక్ష్మీనారాయణ గడ్డం వెంకటేశ్వరరావు తదితర తెలుగుదేశం పార్టీ శ్రేణులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మతతత్వ పార్టీలను వారికి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించండి : మౌలానా అల్తాఫ్ రెహమాన్ మురాది

పొన్నూరు మేజర్ న్యూస్ : రానున్న ఎన్నికలలో మతతత్వ పార్టీలను వారికి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలని ఆంధ్ర ముస్లిం లీగ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులుమౌలానా అల్తాఫ్ రెహమాన్ మురాది పిలుపునిచ్చారు. స్థానిక మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ షాది ఖానా నందు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల కొరకు పాటుపడుతూ మతతత్వ భావాలకు దూరంగా ఉండే పార్టీలను మాత్రమే రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. యూత్ కాంగ్రెస్ పొన్నూరు అసెంబ్లీ ప్రెసిడెంట్ షేక్ కాలే షా మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రంలో అధికార



పక్షం, ప్రతిపక్షం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ ప్రవేశపెట్టిన ప్రతి నల్ల చట్టాలకు మద్దతు తెలుపుతూ ఆంధ్రాలో నై నై అంటూ ఈ రెండు పార్టీలు శత్రువులుగా నటిస్తూ కేంద్రంలో భాయ్ భాయ్ అంటూ కలిసిమెలిసి బిజెపికి మద్దతు తెలుపుతున్నారన్నారు. ముస్లిం యునైటెడ్ ఫ్రెండ్ నాయకులు అంజాద్ హుస్సేన్ మాట్లాడుతూ ఇప్ప టికైనా ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనార్టీ లు ఏకమై మతోన్మాద పార్టీలను వారికి మద్దతిస్తున్న అధికార ప్రతిపక్ష పార్టీలను ఓడించడం ద్వారా బుద్ధి చెప్పాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ నాయకులు అంజద్ హుస్సేన్, మెమన్ భాష, షేక్ నజీర్ ,ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థికి పీహెచ్‌డీ



గుంటూరు, మేజర్ న్యూస్ : చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి చెందిన అంబవరం ప్రతాప్‌రెడ్డి అనే విద్యార్థికి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "ఇన్వెస్టిగేషన్ ఆన్ బాండ్‌విడ్త్ అండ్ గేన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఆఫ్ మైక్రోస్ట్రిప్ ప్యాచ్ యాంటినా ఫర్ వైమ్యాక్స్–5జీ–డబ్ల్యూలాన్ అప్లికేషన్స్" అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమ్.పచియానన్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అంబవరం ప్రతాప్‌రెడ్డిని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

# నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 14,15న సంక్రాంతి సంబరాలు నిర్వహణ

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : ఈ నెల 14 మరియు 15 తారీఖులలో గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఎన్.టి.ఆర్. స్టేడియంను పరిశీలించి, సంక్రాంతి సంబరాల ఏర్పాట్ల పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, గత ఏడాది నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయని నగర ప్రజలకు సంక్రాంతి సంబరాలు ద్వారా తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను గుంటూరు నగరంలోనె జరపుకోనేలా చేశామన్నారు. ఈ ఏడాది కూడా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. సంబరాలలో భోగి పళ్ళు, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులతో పాటు వివిధ సంస్కృతి కార్యక్రమాలు కూడా



జరుగుతాయన్నారు. సంబరాల్లో ప్రజలు,ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున నగర పాలక సంస్థ అధికారులు సమన్వయంతో ఎటువంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ బి. శ్రీనివాసరావు, యస్.ఈ సుందర్రామిరెడ్డి, డి.ఈ.ఈ. మహ్మద్ రఫిక్, ప్రజారోగ్య, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే సహించేది లేదు



తుళ్లూరు మేజర్ న్యూస్ రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతకు విఘాతం కల్పిస్తే సహించేది లేదని తుళ్లూరు సిఐ ఆనందరావు తెలిపారు మంగళవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ తెల్లారుఝామున వెంకటపాలెం సమీపంలో అక్ర మంగా మట్టిబి తరలిస్తున్న ఒక టిప్పర్, జెసిబి స్వాధీనం చేసుకుని ,కేసు నమోదు చేసినట్లు తెలిపారువడ్డమాను గ్రామంలో ఫ్లెక్సీ వివాదంలో ..ఎవరికి కొమ్ము కాయకుండా పారదర్శకంగా దర్యాప్తు చేశాం అన్నారుఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి గ్రామాల్లో ఏటువంటి ఘర్షణలకు తావులేకుండా చర్యలు చేపడతాం అని తెలిపారుఘర్షణలకు పాల్పడే వారి పై... మేజస్ట్రేట్ అనుమతులతో బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించా రు మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగ కుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పార్టీలకతీతంగా వ్యవహరి స్తామని ప్రజల క్షేమం శాంతి భద్రతలను కాపాడే విషయంలో పోలీస్ వ్యవస్థ ముందుంటుందని అన్నారు ఎటువంటి అపోహలకు తావు లేదని సీఐ తెలిపారు.

# బస్సు షెల్టరు, మరుగు దొడ్లు లేక ప్రజల ఇక్కట్లు



పెదకాకాని మేజర్ న్యూస్ : మూడు మతాలకు పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజల్లుతున్న పెదకాకాని సెంటర్లో నిలువ నీడ లేక బస్ షెల్టరు మరుగుదొడ్లు లేక ఇటు భక్తులు ప్రయాణికులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంతేటి ఎలమందరావు పేర్కొన్నారు 16వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న మండల కేంద్రమైన పెదకాకాని జనాభా సుమారుగా 30,000 వేలు అంతేగాక ప్రతిరోజు పెదకాకానికి వివిధ పనులపై మండలములోని అన్ని గ్రామముల నుండి, మండల రెవిన్యూ, కార్యాలయమునకు, మండల అభివృద్ధి అధికారి కార్యాలయమునకు, సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయమునకు మరియు మండల వ్యవసాయ అధికారి వారి కార్యాలయమునకు వేలాదిగా ప్రజలు వస్తుంటారని .అంతేగాక మండల కేంద్రమైన పెదకాకాని నందు వివిధ మతాలకు సంబంధించిన భక్తులు హిందువులు,శ్రీ గంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనము కొరకు, అన్ని వర్గాల ప్రజలు ప్రతి సోమవారం మరియు 2వ శనివారం అన్ని జిల్లాల నుండి భక్తులు తోటలోని ప్రభువు వద్దకు మరియు అన్ని వర్గాల ప్రజలు మహమ్మద్ ప్రవక్త సమాధి కొరకు ప్రతి శుక్రవారం దర్గా వద్దకు అన్ని జిల్లాల నుండి భక్తులు వస్తుంటారని అన్నారు ఇంత పవిత్రమైన స్థలము గల పెదకాకాని సెంటరు నందు ప్రజలు నిలబడుటకు బస్సు సెల్టరు గాని, మరియు మరుగుదొడ్ల సదుపాయము గాని లేక ప్రజలు ముఖ్యంగా భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి ప్రజల ఉపయోగార్థము స్థానిక సంస్థల నిధుల నుండి గాని, స్వచ్ఛ భారత్ నిధుల నుండి బస్ షెల్టర్ మరుగుదొడ్లు నిర్మాణములను పూర్తి చేసి ప్రజలకు గల అసౌకర్యమును తొలగించాలని కోరుతూ పెదకాకాని తహసిల్దార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జొన్నల వెంకట్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోల్ రెడ్డి మండల మైనార్టీ కమిటి అధ్యక్షులు మీరావలి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష పేదలకు వరం: లాలుపురం రాము



గుంటూరు రూరల్, మేజర్ న్యూస్: ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణకు నిర్వహిస్తున్న జగనన్న సురక్ష శిబిరాలు పేదలకు ఒక వరం అని జిడిసిసి బ్యాంక్ చైర్మన్ ఆర్ సితా రామాంజనేయులు (లాలుపురం రాము) కొనియాడారు. గుంటూరు మండలం లాలుపురం గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వచ్చిన 425 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణరావు, ఈవో పి ఆర్ డి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి మీనాక్షి, గ్రామ పెద్దలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం జగన్ తోనే సాధ్యం



పెదకాకాని మేజర్ న్యూస్ : అన్ని వర్గాలను సమానంగా అభివృద్ధి చేసి సామాజిక న్యాయాన్ని చేసి చూపిస్తున్న నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని ఎన్ని దుష్టశక్తులు ఏకమైన సీఎం జగన్మోహన్ రెడ్డిని ఓడించలేవని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పొన్నూరు శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు రాష్ట్రంలో సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తూ సంక్షేమ స్థారధిగా కొనసాగుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలన పట్ల ప్రజలు సానుకూలత వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు పెదకాకాని మండల పరిధిలోని, ఉప్పలపాడు గ్రామంలో కోటి 20 లక్షలతో నిర్మించిన సచివాలయం వన్ సచివాలయం టు హెల్త్ సెంటర్ అంతర్గత సిసి రోడ్లు కల్వర్టులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేయాలని విజ్ఞప్తి చేశారు చేసిన ప్రమాణానికి ఇచ్చిన మాటకు కట్టుబడి నిలబడే ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన మహెూన్నతమైన అభ్యుదయ భావాలు ఉన్న గొప్ప దార్శినికుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుండి రాజ్యాధికారంలో బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తూ వారి ఉన్నతికి తోడ్పాటు అందిస్తున్న గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషి జగన్మోహన్ రెడ్డి అన్నారు ప్రజల జీవన ప్రమాణాలు ఉన్నతంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో వారి ప్రాథమిక అవసరాలను తానే సమకూరుస్తూ అన్ని విధాల అండగా నిలబడుతున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి అన్ని వర్గాల ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందన్నారు విద్య వైద్య ఆరోగ్య రంగాలలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు అవినీతి రహితంగా సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజలకు చేరువ చేయాలని వినూత్నమైన వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల ముంగిటకే చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు సంక్షేమంలో అభివృద్ధిలో విద్య వైద్య ఆరోగ్య రంగాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు తన సుదీర్ఘ ప్రజా సంకల్ప యాత్రలో తాను విన్న తాను చూసిన ప్రజల కష్టాలను తీర్చడానికి దృఢ సంకల్పంతో తనకు తానే రూపొందించుకున్న మేనిఫెస్టోను ఒక భగవద్గీతగా ఒక ఖురాన్ గా భావించి ప్రజలకు తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటానికి మేనిఫెస్టోలోని హామీలను 100% అమలు చేసి ఇచ్చిన మాటకు కట్టుబడిన నాయకుడిగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిలబడ్డారని ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అంశమని అన్నారు సంక్షేమ పథకాల అమలులో కులం మతం పార్టీ చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు లంచాలు లేని వ్యవస్థను సమాజాన్ని ఏర్పాటు చేయాలని సత్సంకల్పంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా లోకల్ గవర్నెన్స్ కార్యక్రమంలో భాగంగా సచివాలయ వ్యవస్థ వాలంటీర్ వ్యవస్థ రైతు భరోసా ఆరోగ్య సురక్ష నాడు నేడు వంటి కార్యక్రమాలతో రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు గత 14 ఏళ్లలో గత పాలకులు చేయలేని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కేవలం నాలుగున్నర ఏళ్లలోనే చేసి చూపించిన గొప్ప నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు గత ప్రభుత్వం 600 హామీలతో మేనిఫెస్టోను రూపొందించి పాలనలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయిందన్నారు డ్వాక్రా రుణమాఫీ రైతు రుణమాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు రైతులను మహిళలను మోసం చేశార న్నారు ఇచ్చిన మాటకు కట్టుబడిన జగన్మోహన్ రెడ్డి డ్వాక్రా రుణమాఫీ చేసి చూపించారన్నారు గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న పెన్షన్ మం జూరు కావాలంటే ప్రజలు నరకం చూశారన్నారు పెన్షన్ మంజూరు కోసం జన్మభూమి కమిటీలకు లంచాలు పెన్షన్ తీసుకోవడానికి మధ్యవర్తులకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితులు ఉండేవి అన్నారు కానీ ఇప్పుడు ప్రతినెల 1వ తేదీన అది ఆదివారమైన సరే ఇతర సెలవు రోజు అయినా సరే సూర్యోదయంతోనే లబ్ధిదారుల ఇంటికి తలుపు తట్టి గుడ్ మార్నింగ్ చెబుతూ వాలంటీర్లు పెన్షన్ అందిస్తున్నారని ఇలాంటి పంపిణీ ఏ రాష్ట్రంలో కూడా జరగడం లేదన్నారు పెన్షన్ కోసం పడిగాపులు పడి ఎక్కడో ఉన్న కార్యాలయం చుట్టూ తిరిగిన గత ప్రభుత్వ విధానాలకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం స్వస్థపలికిం దన్నారు దేశంలో 3000 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు దేశంలో ఎక్కువ మందికి పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం కూడా మన ప్రభుత్వమే అన్నారు అభివృద్ధిని సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుతున్న జగన్మోహన్ రెడ్డిని ప్రతి ఒక్కరు దీవించాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కోరారు కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు తుళ్ళిమిల్లి శ్రీనివాసరావు జడ్పిటిసి గొల్ల జ్యోతి ఎంపీటీసీ జిల్లా ఒక బోర్డు సభ్యులు నంబూరు సుభాని పొన్నూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బందెల ఉదయ శంకర్ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాగంటి మురళీమోహన్ రెడ్డి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఆరిఫ్ మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఆలపాటి రాఘవ సుంకర కృష్ణారెడ్డి ఎంపీడీవో మల్లేశ్వరరావు మండల స్థాయి అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఉండవల్లి మృతి పార్టీకి తీరని లోటు



పెదకాకాని మేజర్ న్యూస్ : భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ కామ్రేడ్ ఉండవల్లి రాఘవులు మృతి పార్టీకి తీరని లోటని. గుంటూరు జిల్లా సిపిఐ కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు మంగళవారం నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ శాఖ కార్యదర్శి డేవిడ్ రాజు మరియు పార్టీ శ్రేణులతో కలిసి ఉండవల్లి రాఘవులు పార్థివ దేహానికి పూలమాలలు వేసి జెండా కప్పి నివాళులర్పించారు ఈ సందర్భంగా జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ కామ్రేడ్ రాఘవులు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్ల ఆకర్షితుడై పార్టీ పోరాటాల్లో పాల్గొని సభ్యత్వం స్వీకరించి గ్రామంలో జరుగుతున్న అరాచకాలపై పోరాడుతూ తప్పనిసరి పరిస్థితులలో చెమల్ల ముడి గ్రామం వెళ్లి అక్కడ పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటూ జై ఆంధ్ర మూమెంట్లో చురుగ్గా పాల్గొని పెత్తందారుల అరాచకాలను పార్టీ సభ్యులతో పాటు ఎదిరించి ఆ తర్వాత పెదకాకాని గ్రామంలో స్థిరపడి గ్రామ కార్యదర్శి గా పనిచేసి ప్రజల మన్నన పొందాడన్నారు కామ్రేడ్ వల్లూరి గంగాధరరావు గారి స్థూపం నిర్మించడంలో ఆయన పాత్ర అమోఘమైనది అన్నారు. గ్రామంలో ఎటువంటి వడిదుడుకులు వచ్చిన పార్టీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేసి గ్రామస్తుల మన్నన పొందేవారన్నారు. ముఖ్యంగా రైతాంగ సమస్యలపై పోరాడుతూ పార్టీ పిలుపుల మేరకు పోరాటాలు కొనసాగించే వారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు ప్రజానాట్యమండలి పలనాడు జిల్లా కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి సంతాపం తెలియజేశారు ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి రెంటల్ కుమారి వెనిగండ్ల గ్రామ కార్యదర్శి బుల్లా బాబురావు రామిశెట్టి శ్రీనివాసరావు ప్రజానాట్యమండలి మండే రవీంద్రబాబు గోపి సుబ్బారావు దర్శి లింగారావు బండ్లమూడి శరత్ బాబు బి వీరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రాబోయే ఎన్నికల్లో అధికారం వైసీపీ దే



తుళ్లూరు మేజర్ న్యూస్ : రాబోయే ఎన్నికలలో తిరిగి మళ్లీ వైసిపి పార్టీ అధికారం చేజిక్కించుకుంటుందని మండల వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర వెంకట శివారెడ్డి శృంగారపాటి సందీప్ పేర్కొన్నారు మంగళవారం ఓదార్పు యాత్ర పూర్తి చేసి ఐదు సంవత్సరాలు సందర్భంగా మండల కేంద్రం తుళ్లూరులోని వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసిన వాళ్ల అర్పించారు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సుభిక్షమైన పాలన సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొని రాజశేఖర్ రెడ్డి కి నివాళులర్పించారు.

## నారాయణలో సంక్రాంతి సంబరాలు



మంగళగిరి మేజర్ న్యూస్: మంగళగిరి టిప్పర్ల బజార్ నారాయణ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులకు భోగి పళ్ళు పోయటం హరిదాసుల వేషధారణ భోగి మంటలు గంగిరెద్దుల కోలాహం రంగవల్లుల పోటీలు విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి .ప్రిన్సిపల్ ఎన్ ప్రసన్నాంజనేయులు, విద్యార్థులకు సంక్రాంతి ప్రాముఖ్యత గురించి చక్కగా వివరించారు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏజీఎం కె మురళి కిషోర్, ఆర్ ఐ ఆర్ రామారావు, ఈ ఛా%శీ%న్స్ కోఆర్డినేటర్ ఫాతిమా ఖాన్ ఈ కిడ్స్ కోఆర్డినేటర్ వి కనకదుర్గ, ఏవో డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలు - మున్సిపల్ కార్మికులు ధర్నా : కళ్యం రాజశేఖర్ రెడ్డి



తాడేపల్లి, మేజర్ న్యూస్: అంగన్వాడీల సమ్మెపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించటాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జైలు భరో కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాడేపల్లి తాసిల్దార్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు గుంటూరు జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు కళ్యం రాజశేఖర్ రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడుతూ అంగన్వాడీల పై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, అంగన్వాడీ మున్సిపల్ కార్మికులతో చర్చలు జరిపి వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడం చేతగాక వారిపై ఎస్మా ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. సమ్మె ప్రారంభించిన 29 రోజులకు రాష్ట్ర ప్రభుత్వానికి అత్యవసర విభాగమని గుర్తుకొచ్చిందా అని ఎద్దేవా చేశారు. కేవలం అంగన్వాడీలను భయపెట్టేందుకే నల్ల చట్టాన్ని తీసుకువచ్చారని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు ఏఐటీయూసీ, సిఐటియు,ఎఐఎఫ్టియూ( న్యూ) సిపిఎం, నాయకులు అంగన్వాడీలు మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సంక్షేమానికి టిడిపి కృషి: బూర్ల



గుంటూరు రూరల్, మేజర్ న్యూస్: రాష్ట్రంలోని దళితుల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ విశేష కృషి చేస్తుందని టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ కన్వీనర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. గుంటూరు మండలం వెంగళాయపాలెం గ్రామంలో 'బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం మంగళవారం జరిగింది. తొలుత తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రామాంజనేయులు మాట్లాడుతూ... టిడిపి హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నూరు శాతం వారి కాలనీలో అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించేవారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం చేస్తుందని విమర్శించారు. వైయస్సార్ పార్టీకి మొదటి నుంచి దళితులంటే ద్వేషమని పేర్కొన్నారు. పేరుకు మాత్రం తమది దళిత పార్టీ అని చెప్తుంటారని... వారి కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని ఈ సందర్భంగా రామాంజనేయులు హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం – జనసేన పార్టీలు సంయుక్తంగా కలిసి పోటీ చేస్తున్నాయని ఇరు పార్టీ అభిమానులు అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గంధం సురేష్, లీలా మల్లేశ్వరరావు, గ్రామ సర్పంచ్ లలిత కుమారి, ఉప సర్పంచ్ మాధవి, నెంబర్లు దేవా, కోటేశ్వరరావు, సుభాని పార్టీ నాయకులు ఆలా కృష్ణ, అవినాష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి కేరాఫ్ అడ్రస్ టీడీపీ : మంత్రి విడుదల రజనీ




గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : తెలుగుదేశంపార్టీ అంటే అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు నగరంలో అంగరంగ వైభవంగా మనతో మన రజినమ్మ కార్యక్రమం కొనసాగుతోంది. 24వ డివిజన్‌లో మంగళవారం మంత్రి రజిని పర్యటించారు. డివిజన్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. వందలాది మంది కార్యకర్తలు, ప్రజల నడుమ పాదయాత్ర చేపట్టారు. వీధి వీధికి వెళ్లి మంత్రి ప్రజలను పలుకరించారు. గుంటూరు వెస్ట్ నియోజకవర్గాన్ని బెస్ట్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అడుగడుగునా చెప్పారు. వీధుల్లో పూలవర్షం కురిసింది. బాణసంచా పేలుళ్లతో పండుగ వాతావరణం నెలకొంది. తీన్‌మార్, డీజే మోతలతో సందడి ఏర్పడింది. సంక్రాంతి ముందే వచ్చిందా.. అన్నట్లు వేడుకగా కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ చంద్రబాబునాయుడు హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కష్ట, నష్టాలతో విలవిలలాడిపోయారని గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి ఏదైనా సంక్షేమ పథకం అందాలంటే జన్మభూమి కమిటీల అనుగ్రహం ఉండాలని చెప్పారు. పార్టీ జెండా కప్పుకుంటేనే పథకాలు అందే పరిస్థితి గతంలో ఉండేదని తెలిపారు. అర్హులైతే చాలు.. సంక్షేమ పథకాలు అందాల్సిందే అన్న నినాదంతో పనిచేస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని చెప్పారు. ఇంటింటికీ ప్రభుత్వ సేవలు వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందేలా చేసిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని మంత్రి తెలిపారు. గతంలో లంచాలు ఇస్తేనే పథకాలు అందేవని, ఇప్పుడు ఎలాంటి సిఫారసులు, లంచాలతో పనిలేకుండా నే లబ్ధిదారులందరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గుంటూరు నగరాన్ని పూర్తిగా విస్మరించారి తెలిపారు. నగరంలోని అన్ని రోడ్లను ధ్వంసం చేసి వదిలేశారని గుర్తుచేశారు. యూజీడీ పనులు వంకతో నగరాన్ని గత ప్రభుత్వంలో సర్వనాశనం చేశారని, పనుల్ని మధ్యలోనే వదిలేసి కోట్లాది నిధుల దుర్వినియోగానికి గత ప్రభుత్వం కారణమైందని ఆరోపించారు. గుంటూరు నగరాన్ని తాము ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామని చెప్పారు. మరోసారి అవకాశం కల్పిస్తే.. గుంటూరును అద్భుతంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నే బెస్ట్ నియోజకవర్గంగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ అడకా పద్మావతి తోపాటు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

# దైవజనుడు డేవిడ్ మృతి



గుంటూరు, మేజర్ న్యూస్ : భగవంతుడిని నమ్ముకుని జీవిస్తూ ఎందరికో వాక్యోపదేశం చేస్తూ అందరి చేత మనసున్న మనిషిగా కీర్తించబడిన దైవజనుడు రేవ. జనిపల్లి డేవిడ్ మంగళవారం మృతి చెందారు. ఎందరికో మార్గదర్శకంగా ఉన్న డేవిడ్ మరణం తీరని లోటని పలువురు పట్టణ ప్రముఖులు ఆయన నివాసం వద్దకు వెళ్లి ఘన నివాళులర్పించారు. ఎంతోమంది పాస్టర్లకు ఆయన మార్గదర్శకులుగా నిలిచారు. ఎన్నో చర్చిల నిర్మాణంలో తన వంతు పాత్ర పోషించారు. నిత్యం ప్రార్ధనలు చేస్తూ. దీనజనుల ఉద్ధరణకు పాటుపడ్డారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు గుంటూరు.లోని రత్నపురి కాలనీలోని ఆయన ఇంటి వద్ద నుండి భూస్థాపిత అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. . ఆయన మృతికి పలువురు సంతాపం తెలియజేస్తూ భూస్థాపిత కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఆయన అభిమానులు, స్థానిక పాస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అనేక మంది పాస్టర్లు రత్నపురి కాలనీలోని ఆయన ఇంటి వద్దకు చేరుకుంటున్నారు.

# వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరిన మహిళలు : మంత్రి విడదల రజిని




గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి మహిళల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు నగరం 21, 25 డివిజన్లకు చెందిన 50 మందికిపైగా మహిళలు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిలో పలువురు తెలుగుదేశంపార్టీ పదవుల్లో కూడా ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ గనిక ఝాన్సిరాణి ఆధ్వర్యంలో మంగళవారం కొరిటెపాడు రోడ్డు చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలోకి చేరిన మహిళలు మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేరుగా తమ బ్యాంకు ఖాతాలకే నగదు జమ చేస్తున్నారని తెలిపారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం ఆదుకుంటూనే ఉందని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని మంత్రి విడదల రజిని ఈ సందర్భంగా చెప్పారు. భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకు మేలు జరిగే విధంగా రూపకల్పన చేశారని తెలిపారు. మహిళలు బాగుంటేనే వారి ఇల్లు బాగుంటుందని, తద్వారా సమాజం, రాష్ట్రం బాగుంటుందని నమ్మి తమ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా వేల కోట్ల రూపాయలను నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నదని వివరించారు. రూ.51 వేల కోట్లతో 32 లక్షల మందికి పైగా మహిళా లబ్ధిదారులకు ఒకేసారి ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే అని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పనిలేకుండా, ఎవరి సిఫారుసులతో సంబంధం లేకుండా ప్రభుత్వ పథకాలను జగనన్న అందజేస్తున్నారని చెప్పారు. గతంలో టిడ్కో ఇళ్ళ నిర్మాణం పేరుతో లబ్ధి దారుల దగ్గర నుంచి స్థానిక టీడీపీ నేతలు ఏ స్థాయిలో కమిషన్లు గుంజారో చూశామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీలు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని ధ్వజమెత్తారు. 25వ వార్డు తెలుగుమహిళ 25వ వార్డు కార్యదర్శి కొదమల అనిత, టిడిపి కార్యకర్తలు రాణి మేరీ, రమాదేవి, ఏసమ్మ, లాజరమ్మ, శాంతి నిర్మల, ఎస్తేరమ్మ, శాంతకుమారి, విజయమ్మ, స్వరూప తదిరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

# 29వ రోజుకు చేరిన అంగన్వాడీ ఆయాల నిరవధిక సమ్మె




దుగ్గిరాల, మేజర్ న్యూస్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దుగ్గిరాల తాసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 29 . వ రోజుకు చేరుకుంది .సమ్మె చేస్తున్న ఆయాలు కార్యకర్తలకు మద్దతుగా సిఐటి ఉపాధ్యక్షులు జెట్టి, బాలరాజు కమ్యూనిస్టు పార్టీ నాయకులు సిహెచ్ పోతరాజు, యే మినేని స్టాలిన్, భీమవరపు అమ్మి రెడ్డి మద్దతు తెలియజేశారు .తదుపరి తాసిల్దార్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ శివాలయం సెంటర్ ,జండా చెట్టు మీదుగా ర్యాలీగా కొత్త లాగుల వద్దకు చేరుకుని 15 నిమిషాలు పాటు రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు చేరుకుని. ట్రాఫిక్ ను పునరుద్ధరించారు...ఈ సందర్భంగా జెట్టి బాలరాజు మాట్లాడుతూ 29 రోజులుగా అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపట్టిన ప్రభుత్వం పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందన్నారు. అధికారులు వాలంటీర్ల ను. పెట్టి కేంద్రాల తాళాలను పగలగొట్టిస్తున్నారని, ఎస్మా చట్టాన్ని ప్రయోగించి అరెస్ట్ చేయడం లాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు హామీలు ఇచ్చి నేడు వారిని బెదిరింపులకు గురిచేయటం సమంజసం కాదన్నారు .న్యాయవాది స్టాలిన్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు సంబంధించి ఇప్పటికే మూడు చర్చలు జరిపారని కానీ కనీస వేతనం గురించి మాట్లాడలేదన్నారు. సమాన పనికి సమాన వేతన ఇవ్వాలని సుప్రీంకోర్టు తెలిపిందన్నారు .తక్కువ వేతనం తీసుకున్న వారిపై ఎస్మా చట్టం ప్రయోగించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇ ప్పటికైనా స్పందించి సరైన వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఆయాలు ,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీతోనే మన భవిష్యత్తుకు గ్యారెంటీ - కోవెలమూడి రవీంద్ర



గుంటూరు, మేజర్ న్యూస్ : టీడీపీతోనే ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రజల భవిష్యతుకు గ్యారెంటీ ఉంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర (నానీ), నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ అన్నారు.మంగళవారం 21వ డివిజన్ లో కే.వి.పి కాలనీలో డివిజన్ అధ్యక్షుడు చిన్న మస్తాన్ వలి నేతృత్వంలో "బాబు ష్యూరీటి - భవిష్యత్తుకు గ్యారెంటీ" కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భముగా కోవెలమూడి రవీంద్ర (నానీ), దేగల ప్రభాకర్ మాట్లాడుతూ... పేదలను ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబనకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు మహానాడు లో ప్రకటించిన మ్యానిఫెస్టో చేయూత నిస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డ నిధి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి తల్లికి ఏడాదికి రూ.15వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలుజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కసుకుర్తి హనుమంతరావు, మల్లె మూర్తి, జనసేన డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, కంచర్ల సాంబశివరావు , చంటి, పఠాన్ జాన్ సైదా, మస్తాన్ వలి , గౌస్ పీరా, వలి, బాజీ వలి తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి నిత్యవసర సరుకులు అందించిన పారేపల్లి



దుగ్గిరాల మేజర్ న్యూస్: దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన ఏమినేని శివయ్య కుటుంబం అనారోగ్య పరిస్థితి వల్ల దీన స్థితిలో ఉన్నారు. విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ స్వాతి గౌడ్ ద్వారా తెలుసుకున్న గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్ స్పందించి ఆ కుటుంబాన్ని పరామర్శించి మంగళవారం వారికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస్ దుగ్గిరాల మండల అధ్యక్షురాలు మధు నాగ దుర్గ, గుంటూరు పట్టణ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర్, మంగళగిరి పట్టణ అధ్యక్షురాలు జి జై లక్ష్మి, మధు వెంకటేశ్వరరావు మంచి కలపుడి మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ నాగమణి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..ఎ.

# అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అంబేద్కర్ ఆలోచనతో నవభారత నిర్మాణం జరిగిందని ఆయన సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం ప్రజల హక్కుల కోసం మహోన్నతమైన రాజ్యాంగాన్ని ప్రజల చేతికి ఇచ్చారని అటువంటి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఈ నెల 19వ తేదీన విజయవాడలో నీ స్వరాజ్య మైదానంలో ప్రారంభం కానున్న దృష్ట్యా అన్ని వర్గాల ప్రజలు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కొనసాగించి సామాజిక న్యాయం కోసం కృషి చేశారన్నారు. ఆయన భాషలోనే ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని రూ.404 కోట్ల వ్యయంతో విజయవాడ నడిబొడ్డులో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల ఆత్మవిమానానికి ప్రతి కానీ ప్రపంచంలో మరెవ్వరూ చేయలేని కార్యక్రమాన్ని జగన్మోహన్ రెడ్డి చేసి చూపించారని ఇది బడుగుల సామాజిక న్యాయానికి దిక్సూచిగా నిలుస్తుందని తెలిపారు.

అదేవిధంగా ప్రభుత్వ పాలనలో కూడా సామాజిక న్యాయాన్ని అమలు చేస్తూ 50 శాతం మహిళలకు పదవులలో రిజర్వేషన్ కల్పించడమే కాకుండా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా నెలలో రెండుసార్లు గ్రామాలకి వైద్యులను పంపించి పేద వర్గాలకు ఉచిత వైద్యం అందించడంతోపాటు 125రకాల మందులను అందజేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఐదు లక్షల నుండి 25 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని పొందే అవకాశాన్ని కల్పించారన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని పండుగలాగా భావించి ఈ నెల 19వ తేదీన అందరూ విజయవాడకు తరలిరావాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రమేష్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గుర్రం బసవయ్య పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు వైసీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి గాజుల జయ గోపాల్ లంకమ్మ టెంపుల్ చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష మండల ట్రేడ్ యూనియన్ నాయకులు గార్లపాటి గోపి, పులిగడ్డ ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ ఇంచార్జ్ బండిరామకృష్ణ మంగినపూడిగ్రామ పర్యటన గ్రామ టిడిపి శ్రేణులతో కలిసి నిర్వహించారు. బందరు మండలం మంగినపూడి గ్రామంలో జనసేన టిడిపి ఉమ్మడి కార్యచరణ తదితర అంశాలను సమావేశంలో చర్చించారు. ఎన్నికల్లో జనసేన టిడిపి శ్రేణులు ఐకమత్యంగా ఉండి జనసేన టిడిపి ఉమ్మడి అభ్యర్థిని గెలిపించి గ్రామాభివృద్ధికి బాటలు వేసుకోవాలని జనసేన పార్టీ మచిలీపట్నం ఇన్చార్జి బండి రామకృష్ణ గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలు గ్రామంలోని సమస్యలను రామకృష్ణ దృష్టికి తీసుకువస్తూ అభివృద్ధి, తాగునీటిసమస్య, రోడ్లపరిస్థితి, స్మశానవాటికల అభివృద్ధిలేమి, పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ సహకారలేమి తదితర సమస్యలను ప్రస్తావించారు. గ్రామంలోని పలు పేద కుటుంబాలు బండి రామకృష్ణను ఆశ్రయించి తమ బాధలను వివరించి ఆదుకోవాలని కోరారు. స్పందించిన బండిరామకృష్ణ వరుస క్రమంలో ప్రతి ఒక్కరికి నా వంతు సహకారం అందిస్తానని పేద కుటుంబాలకు భరోసా ఇచ్చారు. జనసేన టిడిపి కూటమికి మంగినపూడి గ్రామం మద్దతుగా నిలుస్తుందని రానున్న ఎన్నికల్లో ఈ గ్రామం నుండి అత్యధిక మెజార్టీ ఇస్తామని గ్రామ ప్రజలు తెలియజేశారు. గ్రామప్రజల సమస్యలపై స్పందించిన బండి రామకృష్ణ రానున్న జనసేన టిడిపి ఉమ్మడి ప్రభుత్వమని ఇది ప్రజా ప్రభుత్వమని గ్రామంలో సమస్యలన్నిటికీ దశలవారీగా పరిష్కరిస్తూ మంగినపూడిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంఖాయమని గ్రామ ప్రజలకు వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన టిడిపినాయకులు మెండు భానుమూర్తి, గమ్మిడి గరటరాజు, శ్రీపతివాకలరావు గడ్డంరాజు, చౌదరి, గోవాడ రమేష్, చేబోయిన సత్యనారాయణ, మనోజు, పోతురాజు, ప్రవీణు, గోవింద్ నాగేశ్వర రావు, జన్ను నాగరాజు, మోకారవి, జనసేన టిడిపి నాయకుల పాల్గొన్నారు.

## సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పోటీలు



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ప్రజా సేవకులు గాజుల సాంబయ్య నాయుడు సహకారంతో ఈ నెల 11,12,13 తేదీలలో సంక్రాంతి సంబరాలు కృష్ణా జిల్లా స్థాయి లో పెడన లోనిర్వహిం చబోతున్నట్లు ఫౌండేషన్ లీగల్ సెల్ చైర్మన్ లంకిశెట్టి బాలాజీ తెలిపారు. మంగళవారం మచిలీపట్నం లో జరిగిన విలేకరుల సమావేశం లో కరపత్రం ఆవిష్కరించారు. 11 తేది పెడన దేవాంగ కళ్యాణమండపంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పాటల పోటీలు నిర్వహించడం జరుగుతుంది అని 12వ తేదీ దేవాంగ కళ్యాణమండపంలో డ్యాన్స్ పోటీలుజరుగుతాయి అని బాలాజీ తెలిపారు. 13వ తేదీ పెడన వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ముగ్గులు, మెహంది, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని అనంతరం 2 గంటలకు 13వ తేదీ పెడన వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ముగ్గులు, మెహంది, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుంది అని సంస్థచైర్మన్ ఉస్మాన్ భాషా తెలిపారు. అనంతరం 2 గంటలకు మార్కెట్ యార్డ్‌లో విజేతలకు, ఆయా పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులు ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం లో కోన వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

## కన్నడ భాష కవితల పోటీల్లో పన్యారంకు ప్రధమ బహుమతి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నానికి చెందిన ప్రముఖకవి ఆచార్య డాక్టర్ పన్యారం సాంబశివరావు జాతీయ స్థాయిలో కన్నడ భాష కవితల పోటీల్లో ప్రథమ బహుమతిని అందుకున్నారు. ఈ అవార్డుతో మొత్తం 637 అవార్డులు సాధించారు. కన్నడ కవివాణి మాసపత్రిక జాతీయ స్థాయిలో కన్నడ భాషలో నిర్వహించిన కవితల పోటీలో ఆచార్య పన్యారం రచించిన నమ్మ కన్నడ (మనకన్నడ) కవితకు ప్రథమ బహుమతిగా రూ.1500 నగదు, కన్నడ కవితలు అవార్డు 2024 లభించింది. ఈ అవార్డు ను అందుకున్న పన్యారంకు పలువురు విద్యా సాహితీవేత్తలు అభినందించారు.

## ఎస్మా ప్రయోగం దుర్మార్గపు చర్య



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** అంకితభావంతో పని చేసే అంగన్వాడీల సమస్యలు తీర్చకపోగా వారిపై ఎస్మా ప్రయోగించడం ముఖ్యమంత్రి కి సరికాదని మాజీ పార్లమెంట్ సభ్యులు,కృష్ణాజిల్లా తెలుగుదేశం అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా కొనకళ్ళ నారాయణ రావు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. వైకాపా పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిల్లలను రోజంతా చూసుకుంటూ వారికి అక్షరాలు నేర్పించి ఆటలు ఆడిస్తూ పిల్లలను చక్కగా చూసుకునే వారిని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రోడ్డున పడేసిందన్నారు. చిన్నారుల అలనా పాలనతో పాటుగా గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యం, పిల్లలకు వ్యాక్సినేషన్ అంటూ అనేక పనులు చూసుకుంటూ మన కోసం పనిచేస్తున్న అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించడానికి జగన్మోహన్‌రెడ్డి ఆలోచనలు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువలు ధరలకు అనుగుణంగా తమకు వేతనాలు ఇవ్వాల్సిందిగా అంగన్వాడీలు కోరుతున్నారని, చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి పంపి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

## ప్రజాసంకల్పయాత్ర విజయోత్సవ వేడుకలు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం జగన్ ప్రజాసంకల్పయాత్ర విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు ఇంచార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రజాసంకల్పయాత్ర 5 వసంతాల విజయోత్సవ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ వైస్సార్సీపీ కార్పొరేటర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 24వ పాశూరాం వినిపిస్తున్న అన్నపూర్ణ



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ధనుర్మాస ఉత్సవాల్లో పురస్కరించుకుని తిరుపతి దేవస్థానముల ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో తిరుప్పవై ప్రవచనాలు భక్తులకు వివరించారు. గత నెల 17వ తేది నుండి జరుగు తున్న ధనుర్మాస ఉత్స వాల్లో భాగంగా మంగళవారం మండల పరిధి లోని వేకనూరు లోని కొత్తూరు కోదండ రామాలయం వద్ద24వ తిరుప్పవై పాశూరాం తెలుగు అర్థంతో జీయర్ స్వామి వారి శిష్యురాలు అద్దంకి స్వర్ణ అన్నపూర్ణ వివరించారు. గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి రోజు ఉదయం పలు దేవాలయాల్లో ధనుర్మాసం నెల రోజుల పాటు తిరుప్పవై పాశురము తెలుగు అర్థంతో వివరించడం జరుగుతుండగా భారీగా మహిళలు దీపారాధన లతో గోదా కృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అధిక సంఖ్యలో గ్రామస్థులు తరలివచ్చి పాశూరాలను వాటి యొక్క అర్థాన్ని తెలుసుకున్నారు.

## సీతాయలంకలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పంచాయతీ శివారు సీతా లంక గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన ఉమ్మడి మినీ మేనిఫెస్టోలోని హామీలను ఇంటింటికి వెళ్లి వివరించడంతోపాటు అందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. జగన్ రెడ్డిని గద్దె దించినప్పుడే రాష్ట్ర అభివృద్ధి సకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు పార్టీ నాయకులు కర్ర సుధాకర్ జనసేన నాయకులు నాదెళ్ల జేమ్స్ టిడిపి నాయకులు బచ్చు రఘునాథ్ బండే రాఘవ కంచర్ల ఆనంద్ లుక్కాశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## 29వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 29వ రోజుకు చేరుకుంది మంగళవారం అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నాలుగు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం తమను ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన భయపెట్టాలని చూసిన బెదిరేది లేదని యస్మాను విరమించుకునే అంతవరకు సమస్యలు పరిష్కరించేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నిర్మల జ్యోతి ఏ నాగమణి కే పాములమ్మ గాదే సుశీల కాశీ హంస కె విజయరాణి ఎం సుధారాణి ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నారు.

## 11వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ



**గుడివాడ, మేజర్ న్యూస్ :** టీడీపీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు గుడివాడ నియోజకవర్గ ఇంచార్జ్ వెనిగండ్ల రాము నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే రావి సహకారంతో గుడివాడ పట్టణంలోని 11వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నిర్వహించారు. బూత్ నంబర్లు 78, 79, 80లో నిర్వహించిన బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ ప్రచారంలో టీడీపీ అధికారంలోకి వస్తే అమ లుచేసే సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు గుడివాడ సయ్యద్ జబిన్, యూనిట్ ఇంఛార్జి కరీముల్లా, చిన్న, శ్రీను, మస్తాన్, అలీం, మోబిన్, ఇషక్, బాషా పాల్గొన్నారు.



## మునేరు నదిలో అంగన్వాడీల జల దీక్ష

**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల సమ్మె 29వ రోజు నందిగామలో కొనసాగుతుంది. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె. గోపాల్ మాట్లాడుతూ. 29వ రోజు నిరసనలో భాగంగా నందిగామ సమ్మె చేసే టెంట్ దగ్గర నుంచి ర్యాలీగా బయలుదేరి మునేరు దగ్గర ఇసుకలో దీక్ష చేస్తూ అనంతరం మునేరులో జల దీక్ష నిర్వహించారు.ఎస్మా చట్టాలు తెచ్చి అంగన్వాడీలపై నిర్బంధాలు పెట్టిన సరే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేదాకా ఈ ఉద్యమం కొనసాగిస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నందిగామ ప్రాజెక్టు కమిటీ జల దీక్ష ద్వారా ప్రభుత్వానికి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి గోపి నాయక్ మద్దతు తెలియజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దొండపాటి సుధాకర్ కనకపూడి వెంకటరత్నం అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలియజేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కోల్లి సరళ,వెంకట్రావమ్మ, సుజాత, మహాలక్ష్మి,వేణు,వనిత, పిచ్చమ్మ, ఖాచ్యయిని, రాణి, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులను మోసం చేసిన ముఖ్యమంత్రి



**నందిగామ, మేజర్ న్యూస్:** అగ్రిగోల్డ్ బాధితులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మోసం చేశారని టిడిపి మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామి ఆరోపించారు. మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ గత ఏడాది బడ్జెట్ లో రూ 200 కోట్లను కేటాయించినా, అందులో ఎంత ఖర్చు చేశారో స్పష్టం చేయలేదని ప్రశ్నించారు. 2022-2023 బడ్జెట్ లో అగ్రిగోల్డ్ బాధితులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీ0తో అగ్రిగోల్డ్ బాధితులు ను ఆదుకునే చర్యలు ను ప్రభుత్వం నిలిసివేసిందని,బాదితులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మొత్తం బాధితులలో రూ 20వేలలోపు డిపాజిట్లు ఉన్నవారు 10లక్షల మంది ఉన్నారనివారిలో అరులక్షల మందికి ప్రభుత్వం రూ964 కోట్లు చెలి0చిదని,కానీ మిగిలిన వారి బ్యాంక్ కాతలలో జమ కాలేదని విమర్శించారు.ముఖ్యమంత్రి అధికారంలోకి రాగానే అగ్రిగోల్డ్ బాధితులు ను అదుకుంటాము అనీ ఉత్తర కుమార్ ప్రగల్భాలు పలికారని కానీ ప్రభుత్వం వచ్చి 55 నెలలు అయిన ఇంతవరకు అగ్రిగోల్డ్ బాధితులు కు న్యాయం చేయాలేదని,ఇప్పటికయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వ న్నీ గట్టిగా వీరాస్వామిన్ డిమాండ్ చేశారు.

## ఆధునాతన బాబు జగజ్జీవన్ రామ్ భవన్ పరిశీలన



**నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్:** పట్టణం లోని బాబు జగజ్జీవన్ రామ్ భవన్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధులు రూ. 22 లక్షల అంచనా వ్యయంతో బాబు జగజ్జీవన్ రామ్ భవన్ ను కార్పొరేట్ ఫంక్షన్ హాల్స్ ధీటుగా అభివృద్ధి చేసాం అన్నారు. పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో.. అధునాతన ఫంక్షన్ హాల్ గా.. బాబు జగజ్జీవన్ రామ్ భవన్ ను అందుబాటులోకి తీసుకువచ్చాంరానున్న 2, 3 రోజుల్లో ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నాం అన్నారు. నందిగామలోని అన్ని వర్గాల ప్రజలు శుభకార్యాలు, వేడుకలు, సాధారణ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా. 1000 మంది కెపాసిటీకి అనువుగబాబు జగజ్జీవన్ రామ్ భవన్ ను తీర్చిదిద్దాం అన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు శుభకార్యాలు, ఇతరత్రా చేసుకునేందుకు ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ ను ఆశ్రయిస్తే.. లక్షల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి.. ఇకపై అటువంటి ఇబ్బందులు లేకుండా.. సాధారణ రుసుముతో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి ఫంక్షన్ హాల్ ఉంటుంది. జగజ్జీవన్ రామ్ భవన్ అభివృద్ధిలో ఎక్కడ రాజీ పడలేదు.. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఫంక్షన్ హాల్ గా ఉండాలన్నదే లక్ష్యం.. ప్రజలకు మేలు చేసేందుకు మావంతు కృషి చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, ముస్లిం చైతన్య వేదిక అధ్యక్షులు దుబాయ్ కరిముల్లా, కౌన్సిలర్ యాకూబ్ అలీ, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మినీ మేనిఫెస్టో ఆరు పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చేయాలి



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ,జనసేన ప్రకటించిన మినీ మేనిఫెస్టో ఆరు పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చేయడం, ప్రతినిత్యం ప్రజల్లో ఉంటూ, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎలా మేలు జరిగిందో,ఈ వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చినాక ప్రజలు ఏ విధంగా నష్టపోయరో,ప్రజలకు ప్రతి ఒక్కరూ వివరించాలని టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు, సెంట్రల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు సూచించారు. సింగ్ నగర్ సెంట్రల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం 62వ డివిజన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోండా ఉమా మాట్లాడుతూ ఎన్నికలు మరొక 90 రోజుల్లో జరగబోతున్నాయని, అందరూ కూడా అప్రమత్తంగా ఉండాలని, ఈ వైసీపీ ప్రభుత్వం ఏదైనా చేస్తుందని, కాబట్టి 62వ డివిజన్ పరిధిలో ఓట్లు సరి చూసుకోవాలని తెలిపారు. ఈ నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల కాలంలో చాలామంది నాయకులు కష్టపడి పని చేశారని, కొంతమంది ఉద్యోగాలు నిమిత్తం, వ్యాపారాలు నిమిత్తం పార్టీకి ఎక్కువ సమయంలో వెచ్చించలేకపోయారని, కానీ ఇప్పుడు కూడా అందరూ ప్రజల్లోనే ఉండాలని, ఎన్నికలు అయ్యేదాకా తెలుగుదేశం పార్టీ విజయం కోసం నారా చంద్రబాబునాయుడు ని మరలా ముఖ్యమంత్రిని చేయడం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈరోజు వైసీపీ ప్రభుత్వం వచ్చినాక నిత్యవసర ధరలు, గ్యాస్ ధరలు,పెట్రోల్ ధరలు, డీజిల్ ధరలు అన్ని రకాలుగా పెంచి, సామాన్యుడిని బతుకును చిన్నాభిన్నం చేశారని, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిరుపేదలు, సామాన్యులు, దిగువ మధ్య తరగతికి చెందినవారు, వారి కుటుంబంతో చాలా ఆనందంగా గడిపేవారని,ఈరోజు ప్రజలకు తెలుగుదేశం పార్టీ వైసిపి మధ్య వ్యత్యాసం ప్రజలకు చెప్పినట్లయితే,వారే ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకుంటారని తెలిపారు. ఈ వైసీపీ ప్రభుత్వ విధానాలే ప్రజలకు గుదిబండగా మారాయని, సాఫీగా జరిగిపోయే ఇసుకను ఆపి, కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టడం ద్వారా లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులు ఈరోజు అర్ధాకలితో అలమటిస్తున్నారని,ఈ జగన్మోహన్ రెడ్డి జాబ్ క్యాలెండర్ను ప్రకటిస్తామని చెప్పి, నిరుద్యోగులను,విద్యార్థులను నిట్టనినువుల మూసగుంచారని, అన్నా క్యాంటీన్ ను ఎత్తివేసి,బీద, బడుగు,బలహీన చిరు వ్యాపారులకు మధ్యాహ్నం భోజనం లేకుండా చేశారని, సమాజంలో అన్ని వ్యవస్థల మీద, అందరి వ్యక్తుల మీద,అన్ని వర్గాల మీద దెబ్బ కొట్టినది ఈ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం మని దుయ్యబట్టారు. కాబట్టి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం చారిత్రాత్మక అవసరమని, నారా చంద్రబాబునాయుడు పాలన తో మరల తిరిగి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాత రోజులు తిరిగి వస్తాయని, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో అందరికీ వివరించాలని, రాబోయేది తెలుగుదేశం, జనసేన అని చాటి చెప్పాలని తెలిపారు. డివిజన్ పరిధిలో నియోజకవర్గ పరిధిలో జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి పని చేయాలని సూచించారు,ఈనెల 22వ తేది న కొత్త ఓటర్ లిస్ట్ రాబోతుందని, ప్రజల్లోకి వెళ్లి ఓట్లు ఉన్నవో లేవో చూసి, వారి బాధ్యతను వారికి గుర్తుచేయాలని, ఎన్నికలకు వారం రోజులు ముందు వరకు కూడా, కొత్తగా ఓటు హక్కును నమోదు చేసుకునేటువంటి అవకాశం ఎలక్షన్ కమిషన్ కల్పించిందని తెలిపారు. ఇకనుండి ప్రతి 15 రోజులకు ఒకసారి డివిజన్ మీటింగులు జరుగుతాయని,డివిజన్ మీటింగ్లో ఆ పదిహేను రోజులకు జరిగినటువంటి పరిణామాలను చర్చించుకుందాంమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణమోహన్, 62వ డివిజన్ ఇన్చార్జి పైడి శ్రీను, 62వ డివిజన్ అధ్యక్షులు తొట్టెంపూడి ఉదయ్ శంకర్, బత్తుల కొండ, బోను వెంకాయమ్మ,రౌతు మంగరాజు, శ్రీకాంత్,ఒర్సు రవనమ్మ,చొప్పర వరలక్ష్మి, గోసుల రవి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాసంకల్పయాత్రకు ఐదేళ్లు

## కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న వైకాపా శ్రేణులు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం అవనిగడ్డ వైసిపి పార్టీ కార్యాలయం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గుర్రం బసవయ్య మాజీ సర్పంచులు నలుకుర్తి పృధ్వి రాజు సైకం బాబురావు లంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ అన్నపరెడ్డి రామదాసు పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి గాజుల జయగోపాల్ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష మండల ట్రేడ్ యూనియన్ నాయకులు గార్లపాటి గోపి గ్రామ ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు



## సచివాలయ వ్యవస్థతో పాలనలో విప్లవాత్మక మార్పులు



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన ప్రధాన లక్ష్యంగా ప్రజా సంకల్ప యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఏపీలో సచివాలయ వ్యవస్థతో పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి అర్హులైన వారందరికీ విజయవంతంగా సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారుజి. కొండూరు మండలం వెంకటాపురం గ్రామంలో రూ. 43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు (విలేజ్ సెక్రటేరియట్‌లు) వద్ద అన్ని ప్రభుత్వ శాఖల సేవలు, సంక్షేమ సేవలను ఒకే చోట అందుబాటులో ఉంచడంతో పరిపాలనను వికేంద్రీకరించినట్లు పేర్కొన్నారు. మనదేశంలో ఇటువంటి కార్యక్రమాన్ని ప్రారంభించిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఇంటిముంగిటకే సేవలను అందించడానికి ప్రభుత్వం గ్రామ వాలంటీర్లను నియమించిందన్నారు. గ్రామాలు స్వయం సమృద్ధి, స్వయంప్రతిపత్తి గల సంస్థలుగా మారడాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంకటాపురం గ్రామంలో ఇళ్లస్థలాల సమస్యను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రప్రభుత్వం రూ. 3వేలకు పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుకలను లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతుని ప్రత్యేక పూజలు అన్నదానం



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** పరాసుపేటలో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి దేవస్థానంలో రెండవ మంగళవారం సందర్భంగా స్వామికి ప్రత్యేక అలంకరణలు అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలలో తెలుగుదేశం మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి, కొల్లు నీలిమ, పద్మజ పాల్గొన్నారు. ఆలయ భక్తబృందం చే హనుమాన్ చాలీసా పా రాయణం 108 సార్లు జరిగింది. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో హేమలత, కమ్మిలిశివకుమారి విమల, చలమల శెట్టి లక్ష్మీ తయారు, కోక శివకుమారి, గీతా వాణి, వందలాది మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు పర్యవేక్షించారు.

# 2024లో రాష్ట్రానికి చంద్రబాబు సీఎం కావాలి







**నందివాడ,మేజర్ న్యూస్:** బాబు ష్యూరిటి భవిషత్ గ్యారంటీ, గడపగడపకు తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నందివాడ మండలం పెదలింగాల చెదుర్తి పాడు గ్రామాలలో గుడివాడ తెలుగు దేశం పార్టీ ఇన్చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు,మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వ రావు,అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి,జనసేన గుడివాడ నియోజికవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ రానున్న రోజుల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. గ్రామాలలో ప్రజలు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నియోజవర్గంలో రైతుల పరిస్థితి వర్ణానాతీతంగా ఉందన్నారు.సాగు నీటి కాలువల్లో టూడు,గుర్రపు డెక్కు తొలగించక చిన్నపాటి వర్షాలకు కూడా రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల కష్టాలపై ద్రుష్టి సారిస్తామన్నారు. ఈ సందర్భంగా రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపి ప్రభుత్వంలో అంతులేని అవినీతి, అరచకాలు, దోపిడీలు జరిగాయి. అరాచకా లకు పాల్పడిన వారిని ఎవరినీ వదిలపెట్టే ప్రసక్తి లేదన్నారు. నియోజక వర్గంలో అభివృద్ధి చెయ్యకుండా ప్రజల జీవన పరిస్థితులను అస్థవ్యస్థం చేశారన్నారు. చంద్రబాబు నాయుడు మళ్ళి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందిని ప్రజలు తెలుగు దేశం పార్టీని ఆదరిస్తున్నారన్నారు. కొడాలి నాని ఎన్నికల సమయంలో తప్ప గ్రామాలలో తిరిగిన ధాఖలాలు లేవన్నారు.ప్రజల సమస్యలను కొడాలి నాని గాలికి వదిలేశాడన్నారు. వైసీపి ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నా,కనీసం రైతు సమస్యలపై ప్రభుత్వ పెద్దలకు అవగాహన లేదన్నారు.ఈ సందర్భంగా బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ కొడాలి నాని ప్రవర్తనతో నియోజకవర్గ ప్రజలు విసిగిపోయి ఉన్నారు. కనీసం గ్రామాలలో పరిస్థితులను పట్టించుకునే స్థితిలో కొడాలి నాని లేడన్నారు. వెనిగండ్ల రాము అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు.రైతుల సాగునీటి కష్టాలపై స్పందించి వారి కష్టాలు తీర్చిన వ్యక్తి వెనిగండ్ల రాము అని కొని ఆడారు. 2024 ఎన్నికలలో జనసేన, టీడిపి ఉమ్మడిగా వెనిగండ్ల రాము గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నందివాడ మండల పార్టీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు,మండల ప్రధాన కార్యదర్శి నంబూరి రాకేష్, క్లస్టర్ ఇంచార్జ్ ఉప్పల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ చాట్రగడ్డ రవి, యలమంచిలి సతీష్, యార్లగడ్డ రవిబాబు,తోట నాగరాజు, కొల్లి పెద్దబాబు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెంట్రల్ ఎన్నికల సమావేశంలో ఏ విధంగా పవన్ కళ్యాణ్ ని ఆహ్వానించారు?



నందిగామ, జనవరి 9, మేజర్ న్యూస్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ మీద, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మీద హైకోర్టుల రిట్ ఫైల్ చే తెలుగు రాజాధికార సమితి పార్టీ అధినేత జై భీమ్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ సెంట్రల్ ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ వారికి ఆహ్వానం ఏ విధంగా అందింది అని ప్రశ్నించారు రాష్ట్రంలో అనేక రాజకీయ పార్టీలు ఉన్నాయి. కానీ ఎలక్షన్ కమిషన్ తను ఏర్పాటు చేసే సమావేశాలలో అతి కొద్ది పార్టీలకు మాత్రమే అవకాశం కల్పిస్తుంది. కారణం అడిగితే మీకు సరిపడా ఓట్లు సీట్లు లేవు అని చెపుతుంది. కానీ ఇదే సమయంలో అర్హత లేని పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ లాంటి వారికి మాత్రం ఓపెన్ ఎంట్రీ ఉంటుంది. వారు ఆ హోదాలో హాజరై రాష్ట్రంలో ఫెయిర్ ఎలక్షన్ లు జరగాలి అని మాట్లాడుతారు. డబ్బు, పలుకుబడి ఉన్న వారు అర్హత లేకపోయినా ఆహ్వానం పొందుతారు అనే దానికి ఇది ఒక ఉదాహరణ.పవన్ కళ్యాణ్ ఏ హోదాలో విజయవాడలో, నోవాటెల హోటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా టీం ని కలిశారో పవన్ కళ్యాణ్ బహిరంగంగా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో పవన్ కళ్యాణ్ మీద హైకోర్టుల రిట్ ఫైల్ చేస్తాము, హైకోర్టుకు సమాధానం చెప్పాల్సి వస్తుంది అని ఈ సందర్భంగా జై భీమ్ శ్రీనివాస్ తెలిపారు.

# వాగ్దేవి నర్సింగ్ కళాశాలలో లాంప్ లైటింగ్ వేడుకలు





**జగ్గయ్యపేట జనవరి 9 మేజర్ న్యూస్ :** పట్టణంలో గల వాగ్దేవి నర్సింగ్ కళాశాలలో వైద్య సేవలకు గుర్తుగా లాంప్ లైటింగ్ వేడుకలను జరుపుకోవడం జరుగుతుందని డాక్టర్ నరసింహారావు అన్నారు.వాగ్దేవి నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినీల క్యాపింగ్, లాంప్ లైటింగ్ శర్మని చాలా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా నందిగామ ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ జగ్గయ్యపేట ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్ ప్రభాత్ ప్రభాస్ కంటి హాస్పటల్ సీనియర్ వైద్యులు డాక్టర్ ఎస్ వి నరసింహారావు, కె. సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ జగ్గయ్యపేటలో నర్సింగ్ కళాశాల స్థాపించి ఈ ప్రాంత వైద్య సేవ వైద్య అవసరాలను మెరుగుపరచడానికి వాగ్దేవి కళా శాల వారు చేసిన కృషిని అభినం దించారు. డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైట్ యాంగిల్స్ చేసిన వైద్య సేవల సేవలకు గుర్తుగా ఈ లాంప్ లైటింగ్ వేడుకలను నర్సింగ్ కళాశాలలో నిర్వహిస్తార ని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా నర్సింగ్ విద్యార్థులు ప్రతిజ్ఞతో మంచి సేవా కార్యక్రమాలు అలవర్చుకోవటం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని వివరించారు. కే సత్యనారాయణ మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థి నులకు బంగారు భవిష్యత్తు ఉందని సమాజంలో వారి సేవలు చిరస్మరణీ యమని వివరించారు.వాగ్దేవి విద్యా సంస్థల అధినేత బుస్స సురేష్ మాట్లాడు తూ జగ్గయ్యపేట విద్యార్థినిలకు నర్సింగ్ విద్యను అందుబాటులో తేవటం ద్వారా మంచి ఉపాధి అవకాశాన్ని పెంపొందించటమే కళాశాల లక్ష్యం అని వివరించారు.ఈ కార్యక్రమం కళాశాల కరస్పాండెంట్ బుస్సా సరిత ఆధ్వర్యం లో నిర్వహించబడింది. అనంతరం నర్సింగ్ విద్యార్థి నలచే జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పటల్ హెడ్ నర్సస్ క్యాప్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి వారిచే నర్సింగ్ మూర్తికి సంబంధించిన ప్రతిజ్ఞ ను సేవా భావాన్ని పెంపొం దించే విధంగా చేయించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాగ్దేవి ప్రిన్సిపాల్ బుస్సా సురేష్ మాట్లాడుతూ ఈ క్యాప్టింగ్ లాంప్ లైటింగ్ సెర్మని తర్వాత నర్సింగ్ విద్యార్థులను హాస్పిటల్స్ లో క్లినికల్ ప్రాక్టీస్ కొరకు పోస్టింగ్ కి పంపించడం జరుగుతుందని వివరించారు.



# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

**ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన జి.కొండూరు మండల సర్వ సభ్య సమావేశం జి.కొండూరు మండల ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ అధ్యక్షతన నిర్వహించారుఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల పరిషత్ నిధుల ద్వారా మండలం లోని గ్రామాల అభివృద్ధి కొరకు సుమారు 1.76 కోట్లు మంజురు చేశామని, పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు.ఇంకా పలు గ్రామాల అభివృద్ధికి గాను నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారుఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు మందా జక్రదరరావు, ఏఎంసి చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి,ఎంపీడీఓ అనురాధ,వైస్ ఎంపీపీ లు పుప్పాల సుబ్బారావు, ఈలాప్రోలు తేజ శ్రీ,అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సందర్భంగా జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**వత్సవాయి జనవరి 9 మేజర్ న్యూస్ :** మండలంలోని లింగాల గ్రామంలో శివాలయం ఆలయ ప్రాంగణంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు సామూహిక భోగి పళ్ళ వేడుకలు ఘనంగా నిర్వహించాలని తెలిపారు ఈ పోటీల్లో పాల్గొవ్వాలి అనుకునేవారు వారి పేరు ఫోన్ నెంబరు ఈ 9949857276 నెంబర్ కి ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాల్సిందిగా వారు తెలియజేశారు. 14.01.2024న భోగి పండుగ సందర్భంగా శివాలయంలోని ముగ్గుల పోటీలు మధ్యాహ్నం 2.00 నుండి సాయంత్రం 4.30 వరకు నిర్వహించబడును. ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి ఆకర్షణీయమైన బహుమతులు కూడా ఉన్నాయని జయప్రద ఫౌండేషన్ వారు తెలియజేశారు. ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి మొదటి బహుమతి 5000 రూపాయలు, రెండవ బహుమతి 4000 రూపాయలు,మూడవ బహుమతి 3000 రూపాయలు, నాలుగవ బహుమతి 2000 రూపాయలు,ఐదవ బహుమతి 1000 రూపాయలు అందజేయడం జరుగుతుంది అని వారు తెలిపారు.